

గోదావరి వరద.. దూసుకొస్తోంది!

ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలతో గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. గత 24 గంటల్లోనే భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 30 అడుగుల నుంచి శుక్ర వారం సాయంత్రానికి 37 అడుగులకు చేరుకుంది. మరికొద్ది గంటల్లో తొలి ప్రమాద హెచ్చరిక దిశగా నీటిమట్టం చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నా రు. ఇప్పటికే ముంపు మండలాలైన కుకునూరు, వేలేరుపాడులో వరద ఛాయలు కనిపిస్తున్నాయి. వాగుల్లోకి గోదావరి నీరు ఎగబాకడంతో ఎక్కడికక్కడ కాజ్‌వేలు నీట మునగడంతో రాకపోకలకు అవాం తరం ఏర్పడింది. వేలేరుపాడు మండలం ఎద్దువాగు కాజ్‌వే పైకి వరద నీరు చేరడంతో 14 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరులో గుండేటి వాగు పరిస్థితి ఇదే మాదిరి ఉంది.

కుక్కునూరు-దాచారం గ్రామాల మధ్య నీటమునిగిన గుండేటివాగు లోలెవల్ కాజ్‌వే

(ఏలూరు/కుక్కునూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

నాలుగేళ్లుగా గోదావరి వరదను ఈ రెండు మండలాలు చవిచూస్తున్నాయి. భద్రాచలం వద్ద నీటిమట్టం 43 అడుగులు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేస్తారు. ఈ నాలుగేళ్లలో మూడుసార్లు ఈ హెచ్చరిక జారీ అయింది. గోదావరిలో వరద దూసుకొస్తుండటంతో స్థానికులు అప్రమత్తయ్యారు. ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళుతున్నారు. దాచారం పునరావాస కేంద్రంలోకి ఇప్పటికే వారు చేరుకోవడం ఆరంభించారు. రెండు రోజుల క్రితమే కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి వరద ముంద స్తు నివారణ చర్యలపై సమీక్షించారు. ముంపు మండలాలకు వెళ్లి అధికారులకు సూచనలు చేశారు. ఈ సమీక్ష ముగిసిన 24 గంటల వ్యవధిలోనే ప్రత్యేకాధికారులను నియమించారు.

జూలై వచ్చిందంటే చాలు..

ఏటా జూలై వచ్చిందంటే చాలు కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు వణికిపోతున్నాయి. 2022లో చేదు అనుభవాలను మిగిల్చాయి. జూలై 11న గోదావరిలో వరద పతాక స్థాయికి చేరుకోవడంతో వేలేరుపాడును ముంచెత్తింది. కరెంటు స్తంభం ఎత్తుకు పైబడే వరద ముంచెత్తడంతో స్థానికులే విస్తుపోవాల్సి వచ్చింది. రేపాకగొమ్ము వరద తాకిడికి చిన్నాభిన్నమైంది. స్థానికు లు సమీపంలోని గుట్టలపైకి చేరి రెండు వారాలపాటు బిక్కు బిక్కుమంటూ గడిపారు. ఇప్పటికే రేపాకగొమ్ముతోపాటు రుద్రం కోటవాసులు గుట్టపై నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అధి కారులు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచనలు చేసినా పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇంతకు ముందు 2023 జూలై చివరి వారంలో భద్రాచలం వద్ద 56 అడుగులు నీటిమట్టం నమోదు కావడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. ఇప్పుడు సరిగ్గా జూలై 11 రానే వచ్చింది. ఆ వెంటనే గోదావరిలో వరద తొలి ప్రమాద హెచ్చరికకు చేరువ అవుతోంది. 1986 తొలి సారిగా భద్రాచలం వద్ద 75.60 అడుగుల మేర వరద నీటి మట్టం నమోదైంది. 27 లక్షల క్యూసెక్కుల నీటి మట్టం విడుదలైంది. 2022లోనూ 71.30 అడుగుల నీటిమట్టం నమోదు కాగా అప్పట్లో 21.78 లక్షల క్యూసెక్కుల నీటి వరదనీరు (మిగతా 8వ పేజీలో)

పునరావాస కేంద్రాలకు రండి : ఎంపీ మహేశ్‌కుమార్

భారీ వర్షాలతో పెరుగుతున్న వరద ఉధృతి నేపథ్యంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అధికారులను అప్ర మత్తం చేశారు. నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలిం చాలని, వరద ఉధృతి తగ్గేంత వరకు అన్ని జాగ్రత్తలు తీసుకోవా లని జిల్లా యంత్రాగాన్ని కోరారు. నది పరీవాహక ప్రాంతాల వైపు ప్రజలు ఎవరూ వెళ్లకుండా అధికారుల సూచనలను పాటించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు అప్రమత్తం

- భద్రాచలం వద్ద నేడు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం
- పునరావాస కేంద్రాలకు స్థానికుల తరలింపు
- జిల్లా, మండలస్థాయిలో కంట్రోలు రూమ్‌ల ఏర్పాటు
- ముంపు ప్రాంతాలకు చేరుకున్న ప్రత్యేకాధికారులు
- పునరావాస కేంద్రాల్లో విద్యుత్ సహా సౌకర్యాల ఏర్పాటు



దాచారం పునరావాస కాలనీకి ఆటోలో తరలి వెళ్తున్న కుక్కునూరు మండలం గొమ్ముగూడెం నిర్వాసితులు

కంట్రోల్ రూంలు ఇవే :

- జిల్లా కంట్రోల్ రూమ్ 1800 233 1077
- స్టేట్ కంట్రోల్ రూమ్ 833-390-8335022
- జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఆఫీసు - 83092 69056
- కుక్కునూరు తహసీల్దారు ఆఫీసు - 83092 46369
- వేలేరుపాడు తహసీల్దార్ ఆఫీసు - 83286 96546

విద్యుత్ సమస్యలపై కంట్రోల్ రూం ఏర్పాటు

జంగారెడ్డిగూడెం: భారీ వర్షాలు, గోదావరి వరదల కారణంగా విద్యుత్ అంతరాయాలు, విద్యుత్ పునరుద్ధరణకు జంగారెడ్డి గూడెం విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ శుక్ర వారం తెలిపారు. వరద ప్రాంతాల ప్రజలు 94910 30712కు ఫోన్ ద్వారా సమాచారం తెలుపవచ్చన్నారు



క్యూటెస్ట్ వీడియో ఆఫ్ ద డే

- 'మెగా పేరెంట్స్ డే'పై పోలవరం విద్యార్థిని రీల్
- మంత్రి లోకేశ్ మెచ్చుకుంటూ సోషల్ మీడియాలో పోస్టు

చాట్రాయి, జూలై 11(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలం పోలవరం ప్రాథ మిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థిని రాళ్ళబండి శుభశ్రీ రూపొందించిన 'మెగా పేరెంట్స్ డే' రీల్‌కు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ 'క్యూటెస్ట్ వీడియో ఆఫ్ ద డే' అంటూ కితాబు ఇచ్చి, ఆ వీడియోని డౌన్‌లోడ్ చేసుకుని తన సోషల్ మీడి యా అకౌంట్‌లో పోస్టు చేశారు. మర్ల పాలెం జడ్పీ హైస్కూల్‌లో కాంట్రాక్ట్ డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న ప్రసాద రాజు, సుకన్య దంపతుల కుమార్తె భానుశుభశ్రీ 'భాను విలేజ్ థాట్స్' పేరుతో రీల్స్ చేసి సామాజిక మాధ్యమా లలో పోస్టు చేస్తోంది. పల్లె వాతావ రణం, పచ్చటి పంట పొలాలు, అంత రించి పోతున్న పల్లె ఆటలు, స్వచ్ఛమైన గాలినీరు, చిన్ననాటి సంగతులు, పల్లె సంస్కృతి సంప్రదాయాలు మొదలైన అంశాలపై రీల్స్ చేస్తూ ప్రశంసలు పొం దుతోంది. ఈమెకు 1.76 లక్షల మంది ఫాలోవర్స్ ఉండడం విశేషం. కాగా తాను చదివే స్కూల్ జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ విశేషాలను వివ రిస్తూ ఆమె రీల్ చేసి పోస్టు చేయగా మంత్రి లోకేశ్ ప్రశంసించారు.తాను రూపొందించిన రీల్‌ను మంత్రి లోకేశ్ మెచ్చుకోవడంతో భాను శుభశ్రీ, ఆమె తల్లిదండ్రులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బు అవుతున్నారు.

గుప్పుమంటున్న గంజాయి

- కైకలూరు ప్రాంతంలో పెరుగుతున్న గంజాయి కల్చర్
- అధికారులు ఉక్కుపాదం మోపాలంటున్న స్థానికులు

■ లోపలి పేజీలో..

రెండో విడత తల్లికి వందనం ఆర్థిక సాయం జమ

ఏలూరు అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి, జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థుల తల్లు లకు ఖాతాలకు తల్లికి వందనం రెండో విడ త ఆర్థిక సాయాన్ని జమ చేస్తోంది. గురు వారం నిర్వహించిన మెగా పీటీఎం నుంచే ఇది మొదలైంది. జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చేరిన 15,039 మంది విద్యార్థు ల్లో 13,523 మందిని మాత్రమే తల్లికి వంద నం నగదు సాయానికి అర్హులుగా ఎంపిక చేశారు. తల్లుల బ్యాంకు ఖాతాలకు రూ.13 వేలు చొప్పున నగదును జమ చేస్తున్నారు. తొలి విడతలో ఇంటర్ సెకండియర్ చదువు తున్న 15,482 మంది తల్లుల ఖాతాలకు డబ్బులు జమ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల ఒకటో తేదీ వరకు 22,233 మంది బాల బాలికలు ఒకటో తరగతిలో చేరారు. సిక్స్ స్టెప్ మార్గదర్శకా ల మేరకు పథకానికి అర్హులైన తల్లులను ఎంపిక చేశారు. ఈ వివరాలను లీప్ యా ప్‌లో అప్‌లోడ్ చేసిన అధికారులు జిల్లా అంతటికీ క్రోడీకరించిన జాబితాను విద్యా శాఖకు శుక్రవారం సాయంత్రం వరకు పంపలేదు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యా శాఖ సొంతంగా లబ్ధిదారుల సంఖ్యను తెలుసుకునేందుకు మండలాల వారీగా ఎంఈవోలను సంప్రదిస్తోంది. సోమవారం పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

స్పీడ్‌పోస్టులో దూరవిద్య టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణుల సర్టిఫికెట్లు

ఈ ఏడాది మార్చిలో జరిగిన ఏపీ సార్వ త్రిక విద్యాపీఠం (అపోస్) దూరవిద్య టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యా సకులకు ఆన్‌లైన్ అడ్మిషన్ సమ యంలో నమోదు చేసిన చిరునామాకు పాస్ సర్టిఫి కెట్లు, మైగ్రేషన్ కం ట్రాన్సఫర్ సర్టిఫికెట్లను స్పీడ్ పోస్టులో పంపించనట్టు డీఈవో వెంక టలక్ష్మమ్మ తెలిపారు. అభ్యాసకులకు పంపిన తపాలా పార్శిల్ వివరా లను ఏపీ ఓపెన్ స్కూల్స్ వెబ్‌సైట్ నుంచి ట్రాకింగ్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

సూర్యఘర్‌లో జిల్లా ప్రథమస్థానం

ఏలూరుసిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన అమ లులో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. జిల్లాలో ఈ పథకంలో రూ.12.14 కోట్ల సబ్సిడీతో 2,353 మంది గృహ విద్యుత్ వినియోగదారులు 7.8 మెగావాట్ల సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకున్నారు. మొదటి, రెండవ కిలోవాట్‌కి సంబంధించి ప్రతి కిలో వాట్‌కు రూ.30వేలు, మూడవ కిలోవాట్‌కు రూ.18 వేలు మొత్తంగా మూడు కిలోవాట్ల వరకు గరిష్ఠంగా రూ.78వేలు వరకు సబ్సిడీ ఇస్తారు. ద్వారకా తిరుమల, దుగ్గిరాల, చిన నింద్రకొలను, తడికలపూడి, ఎర్రంపేట గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా గుర్తించారు. ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో ఐదెకరాల విస్తీర్ణంలో ప్రభు త్వ భూమిని గుర్తించి అందులో పైలెట్ ప్రాజెక్టు కింద 750 కేడబ్ల్యూపీ సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశారు. పెదవేగి, టి.నరసాపురం మండలా ల్లో ప్రయోగాత్మకంగా రెండు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను ఎంపిక చేసి సోలార్ పానెల్స్‌ను ఉచితంగా ఏర్పాటు చేశారు. సూర్యఘర్ పథకాన్ని వినియోగదారులు వినియోగించుకుని విద్యుత్‌బిల్లుల నుంచి ఉపశమనం పొందాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు సూచించారు.



ర్యాలీలో డీఎంహెచ్‌వో, డీఐవో, తదితరులు

వేళకు వెళ్లకుంటే వైద్యులపై చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం

ఏలూరు అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ)కింద నిర్వహి స్తున్న 104 సంచార వైద్య వాహనాల్లో అన్ని టెస్టుల కిట్లు అందుబాటులో ఉండటంతోపాటు, వాటిపై విధులు నిర్వర్తించే వైద్యాధికారులు నిర్ణీత సమయానికి వెళ్లాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం ఆదేశించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై శుక్రవారం జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యాధికారులతో నిర్వహిం చిన జూమ్ కాన్ఫరెన్సులో సమీక్షించారు. పలువురు వైద్యాధి కారులు సకాలానికి విధులకు హాజరు కావడం లేదని ఫిర్యా దులు వస్తున్నాయని, ఈ పద్ధతి మార్చుకోకపోతే ఇబ్బం దులు తప్పవని హెచ్చరించారు. ఎన్‌సీడీ సర్వేపై జరిగిన సమీక్షలో జిల్లాలో ఇప్పటివరకు 77శాతమే సర్వే పూర్తవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

జనాభా దినోత్సవ ర్యాలీ

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్ర వారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నగర ప్రధాన కూడళ్ల మీదుగా ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్‌లో మానవహారాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ శోభ, గణాంకా ధికారి డాక్టర్ ప్రదీప్తి, తదితరులు పాల్గొన్నారు.



భీమడోలు ఆనంద నిలయంలో చెమ్మ చేరి ధ్వంసమైన శ్లాబ్

■ లోపలి పేజీలో..

సం'క్షామ' హాస్టళ్లు

- వెన్నాడుతున్న సమస్యలు
- ఎవరికీ పట్టనంత నిర్లక్ష్యం
- శిథిలావస్థలో భవనాలు
- బిక్కుబిక్కుమంటూ పిల్లలు
- అరకొర వసతులతో అవస్థలు
- కొన్నిచోట్ల కటిక నేలపైనే పడక

హాస్టళ్ల స్థితిగతులపై 'ఆంధ్రజ్యోతి' విజిట్

బోధన మాధ్యమం వివాదం..

నలుగురు టీచర్లకు మెమోల జారీ

ఏలూరు అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ నిబంధనలకు, విద్యార్థుల అభీష్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న నలుగురు టీచర్లకు జిల్లా విద్యా శాఖ శుక్రవారం మెమోలు జారీచేసింది. ఏలూరు నగరంలోని మౌలానా అబుల్‌కలాం అజాద్ (మాకా) మున్సిపల్ ఉర్దూ హైస్కూలు, తూర్పువీధి ఉర్దూ మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులకు బోధించే మాధ్యమాల (మీడియం) విషయంలో కొంతకాలంగా రచ్చ జరుగుతోంది. ఈ వివాదం రాష్ట్రస్థాయికి చేరుకోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(కాకినాడ ఆర్జేడీ) నాగమణి ఇటీవల ఏలూరు డీఈవో కార్యాలయంలో విచారణ నిర్వహించారు. రచ్చ జరుగు తున్న రెండు పాఠశాలల టీచర్లను పిలిపించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు, పాఠశాలల పునర్వ్యవస్థీకరణ మార్గదర్శకాల మేరకు ఏర్పడిన ఈ రెండు హైస్కూళ్లలో బోధించే మాధ్యమాల విషయంలో ప్రభుత్వానికే సర్వాధికారాలుంటాయని, ఆ ప్రకారమే విద్యార్థులు కోరుకున్న మాధ్యమంలో పాఠ్యాంశాల బోధన జరిగి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఒక పాఠశాల టీచర్లు తమకు ఉర్దూ లేదా ఇంగ్లీషు మాధ్యమాల్లో బోధించడానికి ఎటువంటి అభ్యంతరం లేదని లిఖితపూర్వకంగా ఆర్జేడీకి తెలపగా, మరో పాఠశాల ఉపాధ్యాయులు మాత్రం తాము ఇంగ్లీషు లేదా తెలుగు మీడియంలలో బోధించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అయితే ఈ అభిప్రాయాలను ఆర్జేడీ వద్ద చెప్పిన టీచర్ల వివరాలు తెలియరాలేదు. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి తమ సొంత నిర్ణయం మేరకు మాధ్యమంలో బోధించేందుకే కట్టుబడిన నలుగురు టీచర్లకు జిల్లా విద్యాశాఖ మెమోలు జారీచేసింది. విద్యాశాఖ అనుమతి లేకుండా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే చర్యలు తీసుకుంటామని మెమోల్లో అధికారులు స్పష్టం చేసినట్టు తెలిసింది. కాగా అదే స్కూలులో పనిచేస్తున్న మరో ఇద్దరు టీచర్లు ప్రభుత్వ ఆదేశాల మేరకు బోధించడానికి అభ్యంతరం చెప్పబోమని హామీ ఇచ్చారు. మెమోల జారీని విద్యాశాఖ వర్గాలు శుక్రవారం రాత్రి ధ్రువీకరించాయి.

ఆక్రమణల చెరలో..

- బోదెలా మారిన బ్రాంచ్ కెనాల్
- శివారుకు చేరని సాగునీరు



ముదినేపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామాలకు చెందిన 1200 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే చినపాలపర్రు బ్రాంచి కాల్వ (నల్లకాల్వ) ఆక్రమణలతో కుచించుకు పోయి చిన్నపాటి పంట బోదెలాగా మారింది. కోడూరు ఛానల్ నుంచి చీలి ప్రత్తిపాడు, ముదినేపల్లి, చినపాలపర్రు గ్రామాలకు చెందిన ఆయకట్టుకు సాగు నీరందించాల్సిన ఈ నల్ల కాల్వలో నీరుపారే అవకాశమే లేకుండా పోయింది. ఈ కాల్వగట్టు పక్కనే చేపల చెరువులను తవ్వడం వల్ల కాల్వ వెడల్పు తగ్గి పూడుకుపోయింది. శివారున ఉన్న చినపాలపర్రు ఆయకట్టు భూములకు నీరందడం కష్టంగా మారింది. ఆ గ్రామ ఆయకట్టు రైతులు పోల్‌రాజ్ డ్రెయిన్, కోడూరు రోడ్ సైడ్ డ్రెయిన్ మురుగునీటిని ఇంజన్లతో తోడుకుని వరిసాగు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, కాల్వను సర్వేచేసి వెడల్పు పెంచేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ టీడీపీ నాయకుడు దుక్కిపాటి చక్రధర్ కోరారు.

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు : ఎస్ఈ

ముదినేపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి):పోల్ రాజ్ కెనాల్ కింద ఆయకట్టుకు సాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ ఎస్ఈ డి.మోహనరావు హామీ ఇచ్చారని ఆ కెనాల్ ముదినేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ హనుమార పేర్నీడు తెలిపారు. 'సార్వా సాగుకు నీటి ఎద్దడి' శీర్షికన శుక్ర వారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు స్పందించిన ఆయన పోల్‌రాజ్ సెక్షన్ ఏఈ సత్యనారాయణతో కలసి పెయ్యేరు ఏరియాలో నీరందని భూములను పరిశీలించారు. ప్రస్తుతం నెలకొన్న సాగునీటి ఎద్దడిని ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లగా, పోల్‌రాజ్ కెనాల్‌కు నీటి విడుదలను పెంచుతామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

కాగా కోడూరు ఛానల్‌కు నీటి విడుదలను పెంచుతామని గుడివాడ సెక్షన్ ఏఈ బేగ్ తెలిపారు. ఇంజన్లతో నీరు తోడుతూ సాగు చేస్తున్న పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు స్పందించిన ఆయన భూములను పరిశీలించారు.

సం'క్షామ' హాస్టళ్లు

పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లల చదువులకు సంక్షేమ హాస్టళ్లే దిక్కు. ఒకప్పుడు పిల్లల అవసరాలను తీర్చడమే కాకుండా అవసరమైన సౌకర్యాలతో హాస్టళ్లు ఉండేవి . రానురాను హాస్టళ్ల నిర్వహణ అడ్డగోలుగా మారింది. అనేక చోట్ల పిల్లలు బయటకు చెప్పుకోలేని పరిస్థితులు చవిచూస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సంక్షేమ హాస్టళ్ళల్లో ఒక్క ఏలూరు జిల్లా పరిధిలోనే అనేకం శిథిలావస్థకు చేరాయి. పెచ్చులూడి కుప్పకూలడానికి సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని తలుపులు, కిటికీలు దెబ్బతిని దీనావస్థలో ఉన్నాయి. మరు గుదొడ్ల పరిస్థితి అంతంత మాత్రమే. కొన్ని హాస్టళ్ళల్లో బాత్ రూములకు దిక్కులేదు. రాత్రిపూట ఆదమరిచి నిద్రించేందుకు అనువైన పరిస్థితులు లేవు. కొన్నిచోట్ల కటిక నేలమీదే పిల్లల పడక. ఇస్తామన్న కాస్మోటిక్ చార్జీలు కొందరికే పరిమితం.. కనీస వస్తువులు, పుస్తకాలు భద్రప రిచేందుకు ట్రంకు పెట్టెల సరఫరా ఎప్పుడో వదిలేశారు. దీనికితోడు తాగునీరు నాణ్యత పరిశీలన లేదు. ఇంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కొన్ని హాస్టళ్లల్లో పిల్లల స్నానాల కోసం వేడి నీళ్ళు ఉంచేందుకు అనువైన సౌకర్యాలు కల్పించారు.జగన్ జమానాలో ఇలాంటి సౌకర్యాలు కాస్తా తుస్సుమన్నాయి. ఆ మాట ఎత్తేందుకు అధికారులు గాని, వార్డెన్‌లు గాని సాహసించలేక పోయారు. జిల్లా వ్యాప్తంగా 50 ఎస్సీ హాస్టళ్ళు, మరో 33 బీసీ, ఏడు ఎస్టీ హాస్టళ్ళల్లో వేల మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టళ్ళ తనిఖీలో తూతూ మంత్రంగా వ్యవహరించడం ఒక ఎత్తయితే.. దూరాభారం మోసి పిల్లలను హాస్టళ్ళల్లో చేర్పించాం కాబట్టి గొడవ పడితే పిల్లలకు ఎక్కడ లోటు జరుగు తుందోననే భయంతో తల్లిదండ్రులు ఎక్కడా నోరు విప్పే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇప్పటికీ కొన్ని హాస్టళ్ళల్లో పరిస్థితి మెరుగు పర్చాల్సింది పోయి చూసీ చూడనట్టు వదిలేశారు. హాస్టళ్ల స్థితిగతులు తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా కొన్ని సమస్యలు బహిర్గతమయ్యాయి...

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వెన్నాడుతున్న సమస్యలు
ఎవరికీ పట్టనంత నిర్లక్ష్యం
శిథిలావస్థలో భవనాలు
బిక్కుబిక్కుమంటూ పిల్లలు
అరకొర వసతులతో అవస్థలు
కొన్నిచోట్ల కటిక నేలపైనే.. పడక

హాస్టళ్ల స్థితిగతులపై 'ఆంధ్రజ్యోతి' విజిట్



చింతలపూడి బాలుర గురుకుల పాఠశాల వరండాలోనే వంట చేస్తున్న దృశ్యం

వర్షం వస్తే ఆవరణ అంతా చెరువే

చింతలపూడి, (ఆంధ్రజ్యోతి): చింతలపూడి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో అన్నీ ఉన్నా అరకొర సౌకర్యాలే అన్నట్టుంది. తల్లిదండ్రులైతే దీనికంటే గతంలోదే బెటర్ అన్నట్టు వ్యాఖ్యానిస్తున్నారు. కనిపెడ రోడ్డులో ఐదు ఎకరాల స్థలంలో 2012లో ఈ పాఠశాల నిధులు మంజూరై 70 శాతం భవనాలు పూర్తి చేసిన తరువాత రాష్ట్ర విభజన జరగడం, ప్రభుత్వాలు మార డంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. ఈ 12 సంవత్సరాలు మార్కెట్ యార్డు గోడౌన్లలో తరగతులు నిర్వహించారు. ఆ గోడౌన్లలోనే తర గతుల నిర్వహణ, వంట, పడక అన్నీ అక్కడే. 12 ఏళ్ల విద్యార్థుల ఇబ్బందులు చూసి 2024లో గత ప్రభుత్వంలో అప్పటి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హాస్టల్‌ను సమీక్షించి శ్రద్ధ తీసుకుని నిర్మాణంలో ఉన్న ఒక భవనాన్ని పూర్తి చేయించి తరగతులను అందులోకి మార్చారు. కొత్త భవనాల్లోకి వచ్చి ఏడాది దాటింది. ఇప్పటికీ తరగతి గదుల్లోనే పడక, వరండాలోనే వంట నిర్వహిస్తూ బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు. ఐదు ఎకరాల ఆవరణలో డార్మిటరీ, డైనింగ్ హాలు, ఉపాధ్యా యులు, సిబ్బంది క్వార్టర్స్ పరిపాలన కార్యాలయం అన్నీ నిర్మాణంలోనే ఉన్నాయి. విశాలమైన ఆవరణ ఉన్నా ఏమాత్రం వర్షం పడినా ఆవరణ అంతా చెరువులా మారు తుంది. నీరు బయటకు పోయే మార్గంలేదు. రాత్రివేళ పాములు కూడా చేరతాయన్న భయం విద్యార్థుల్లో ఉంది. విద్యార్థులు వాడిన నీరు, వంట మురుగునీరు బయటకు వెళ్ళే దారి లేకుండా ఆ ఆవరణలోనే ఎండిపోవాల్సిందే. నిలిచిపోయిన నిర్మాణాలు పూర్తి చేసి ఆవరణ అంతా గ్రావెల్ పరిచి సీసీ రోడ్డు నిర్మించి నీటి సదుపాయం శాశ్వతంగా, మురుగునీరు పోయే డ్రెయినేజి సమస్య తీరిస్తే ఈ పాఠశాలకు సౌకర్యాలు కలుగుతాయి. ప్రిన్సిపాల్ సింగ మయ్యను ప్రశ్నించగా తాను కొత్తగా వచ్చానని, ఇప్పటికే ఈ పాఠ శాలకు కావాల్సిన వాటిపై ప్రభుత్వానికి నివేదిక పంపారని చెప్పారు.



నరసాపురం ఎస్సీ కాలేజీ వసతి గృహం

అద్దె భవనాల్లోనే వసతి గృహాలు

నరసాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణ, మండలంలోని పలు ప్రభుత్వ వసతి గృహాలు ఇంకా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. మొత్తం ఆరు ఎస్సీ, బీసీ ఐదు వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో రెండు ఎస్సీ వసతి గృహాలు మాత్రమే సొంత భవనాలు కలిగి ఉన్నాయి. మిగిలిన నాలుగు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు.రెండు భవనా లకు సుమారు రూ.8 లక్షలతో మర మ్మతులతో మరుగు దొడ్లు, ఇతర పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించారు. పనులు కూడా పూర్తయ్యాయి. ఇక బీసీ వసతి గృహాలు మూడు మినహా ఏటి గట్టు వద్దనున్న హాస్టల్‌లో సరైన సదుపాయాలు లేవన్న వాదనలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అను గుణంగా మరుగుదొడ్లు లేవు. ఈ కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

అసంపూర్తిగా మరమ్మతు పనులు

తణుకు రూరల్, (ఆంధ్రజ్యోతి): తణుకు రూరల్ మండలం పైడిపర్రులోని ఇంటిగ్రేటెడ్ సాంఘీక సంక్షేమ శాఖ వసతి గృహాలలో మరమ్మతులు ఇంకా అసం పూర్తిగానే మిగిలిపోయాయి. కళాశాలలకు వేసవి సెల వులకు ముందే హాస్టల్ భవనాల మరమ్మతులు చేప ట్టినా ఇంకా పూర్తి కాకపోవడంతో హాస్టల్ ఆవరణలోని కంకర గుట్టలను దాటుకుని విద్యార్థులు లోపలికి, బయ టకు రావలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక్కడ రెండు కళా శాలల హాస్టల్స్ నడుస్తుండగా విద్యార్థులు మాత్రం 50 శాతం మించడం లేదు. హాస్టల్ లోపల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు వున్నప్పటికీ ప్రహారీ గోడ నిర్మాణం అసం పూర్తిగా వుండటంతో ఆవరణ కూడా మెరక చేయక పోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.



పైడిపర్రు కళాశాల హాస్టల్ ఆవరణలో కంకర గుట్టలు

ఇరుకు గదిలో ఇబ్బందులు

పెంటపాడు (ఆంధ్రజ్యోతి) : పెంటపాడు మండ లంలో మొత్తం మూడు వసతి గృహాలు ఉన్నాయి. పెంట పాడులో ఎస్సీ బాలురు, బాలికల వసతి గృహాలు, పరిమె ళ్ళలో ఎస్సీ బాలుర వసతిగృహం ఉన్నాయి. పెంట పాడు ఎస్సీ బాలురు గృహంలో 35 మంది, బాలికల గృహంలో 23 మంది, పరిమెళ్ళ బాలుర గృహంలో 65 మంది విదార్థులు ఉన్నారు. పరిమెళ్ల గృహంలో కిటికీలకు మెస్‌లు లేవు దీంతో దోమల బెడద తట్టుకోలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఈ హాస్టల్‌లో వాడకం నీరు కూడా సరిపోవడం లేదు. ఒక బోర్‌పంపు వేయాల్సి ఉంది. పెంటపాడు బాలుర గృహం వర్షం వస్తే ప్రాంగణం మొత్తం వర్షం నీటితో నిండిపోతుంది. దీంతో పారిశుధ్య సమస్యలు తలెత్తున్నాయి. ఈ ప్రాంగణాన్ని మెరక చేయాల్సి ఉంది. పెంటపాడు బాలికల వసతి గృహం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. స్లాబ్ మొత్తం పడిపోయి ఊచలు బయటకు వచ్చాయి. దీంతో అక్కడ ఉన్న బాలికలను గ్రామంలోని మోడల్ ప్రాథమిక పాఠశా లలో రెండు గదులు తీసుకుని అందులో ఉంచుతున్నారు. గదులు చాలక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనం వస్తే తప్ప వీరి కష్టాలు తీరవు.

వర్షం వస్తే ప్రాంగణంలోకి నీరు

ఆకివీడు : ఎస్సీ బాలుర వసతిగృహం వర్షం వస్తే ప్రాంగణం నీటితో నిండిపోతుంది. వసతిగృహం వెనుక ఖాళీ స్థలంలో తుప్పలు ఉండడంతో విష సర్పాల బెడద... రక్షణ కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.




అద్దె పెంకుటింట్లోనే 15 ఏళ్లుగా ..

పోడూరు (ఆంధ్రజ్యోతి): పోడూరు గ్రామంలో మండల స్థాయిలో ఒక బీసీ బాయ్స్ హాస్టల్ ఉంది. 15 ఏళ్లగా అద్దె పెంకు టింట్లోనే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నెలకు రూ.9500 ప్రభుత్వం అద్దె చెల్లిస్తున్నట్లు బీసీ హాస్టల్ వార్డెన్ గుబ్బల బాబు కృష్ణప్రసాదు తెలిపారు. సొంత భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతు న్నారు. హాస్టల్ విద్యార్థులకు నెల నెలా ఇచ్చే సబ్బులు, టూత్‌పేస్టులు, కుంకుడికాయలు, కొబ్బరినూనె వంటి కాస్మో సరుకులకు ప్రభుత్వం విద్యార్థుల బ్యాంక్ ఖాతాలకు సొమ్ములు జమ చేస్తుంది. అయితే ఈఏడాది విద్యా సంవత్సం మొదలై నెల రోజులు కావస్తున్నా ఇంత వరకూ సొమ్ములు జమకాలేదని విద్యార్థులు చెబుతు న్నారు.

మరమ్మతుల కోసం ఎదురుచూపులు

భీమడోలు (ఆంధ్రజ్యోతి): భీమడోలు మండలంలోని ఐదు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో అధికశాతం భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. భీమడోలు, పూళ్ళ, గుండుగొలనులోని వసతి గృహాల్లో సుమారు 350 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తు న్నారు. వసతి గృహాలు మరమ్మ తుల కోసం ఎదురు చూస్తున్నాయి. భీమడోలులోని బాలి కల వసతి గృహం ఆనంద నిలయంలో భవనాల శ్లాబ్ ధ్వంసం అయి వర్షం నీరు గదుల్లోకి చేరుతుంది. ఈ భవనం స్థానంలో కొత్తది నిర్మించాల్సి ఉంది. గుండుగొలను వసతి గృహానికి ఇటీవల నిధులు మంజూరు కాగా ఆగస్టులో కొత్త భవనం నిర్మించనున్నారు. పూళ్ళ, భీమడోలు లోని బాలికల, బాలుర వసతి గృహాలకు ఇటీవల తాత్కా లిక మరమ్మతులు చేపట్టారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారు. విద్యార్థుల వ్యక్తిగత అవసరాల నిమిత్తం సబ్బులు, ట్రంకుపెట్టెలు ఇతరత్రా అవసరాల నిమిత్తం విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లో సొమ్ము జమ చేశారు.





భీమడోలు ఆనంద నిలయంలో ధ్వంసమైన శ్లాబ్



పెదపాడు ఎస్సీ వసతి గృహం నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థుల భవనం

ఇంకా ఒక్కరూ చేరలేదు

పెదపాడు (ఆంధ్రజ్యోతి) : పెదపాడు ఎస్సీ బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరుకోవడం, నివాసయోగ్యంగా ఉండక పోవడంతో కొంతకాలంగా పక్కనే వున్న పెదపాడు హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థుల భవనం (ఆడిటోరియం)లో నిర్వహి స్తున్నారు. గతేడాది 25 మంది పిల్లలు ఆ భవనంలోనే ఉండి చదు వుకున్నారు. ఆడిటో రియంలో ఒకే హాలుగా ఉండటంతో వారంతా రాత్రిపూట నేలపై పడుకునేవారు. అక్కడే వున్న రెండు గదులను బాత్‌రూంలుగా మార్చగా కొంతమంది వాటిని, మరికొంతమంది శిథిలావస్థకు చేరుకున్న భవనంలోనే వున్న బాత్‌రూంలను విని యోగించుకుంటూ వచ్చారు. ఆ భవనం చుట్టూ పెద్దఎత్తున పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగిపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఈ ఏడాది 2025-36 విద్యా సంవత్సరానికి ఎవరూ తమ పిల్లలను ఇక్కడ చేర్చలేదు. దీంతో వసతిగృహం ప్రశ్నా ర్థకంగా మారింది. వసతిగృహం నిర్మాణానికి రూ. 3 కోట్లు మంజూరైనట్లు ఎస్సీ వసతిగృహ వార్డెన్ విజయలక్ష్మి చెబుతున్నారు.

సన్న బియ్యం భోజనంతో సంతృప్తిగా ..

దెందులూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవ్వలి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత సన్న బియ్యంతో భోజనం పెడుతుండడంతో విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వసతి గృహంలో 45 మంది బాలురు ఉన్నారు. మెనూ ప్రకారం సన్నటి బియ్యంతో భోజనం అంది స్తున్నారు. అందరికీ ట్రంకు పెట్టెలు అందించారు. చాపలు కూడా ఉన్నాయి. గతంలో టీడీపీ పాలనలో సోలార్ ద్వారా విద్యార్థులు వేడి నీరు అందించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సదుపాయం లేకుండా పోయింది.



భీమవరం బీసీ హాస్టల్‌లో విరిగిన బాత్రూమ్ డోర్లు

దోమ తెరలు చిరిగిపోయాయి..
బాత్రూమ్ డోర్లు విరిగిపోయాయి..



భీమవరం రూరల్ (ఆంధ్రజ్యోతి) : భీమ వరం పట్టణంలోని బీసీ హా స్టల్ సమస్యలు తిష్టవేశా యి. భవనం సరిగా లేకపో వడం, పైకప్పు పెచ్చులు ఊడిపోవడంతో వాటిని తాత్కాలికంగా మరమ్మ తులు చేశారు. భవనం కిటి కీలకు ఏర్పాటు చేసిన దోమతెరలు చిరిగిపోయాయి. దీంతో విద్యార్థులకు దోమలతో ఇబ్బందులు తలెత్తుతు న్నాయి. స్నానాల గదులు సరిగా లేకపోవడం, వాటికి అ మర్చిన తలుపుల్లో ఒకటైతే సగం విరిగిపోయింది. మిగి లినవి అంతంత మాత్రంగానే ఉన్నాయి. పరిశుభ్రత కూడా ఆ ప్రాంతంలో సరిగా లేదు. దుర్వాసన వస్తుంది. ప్రధానంగా భవనం, ప్రాంగణం మరమ్మతులు చేయిం చాల్సి ఉంది. ఈ హాస్టల్‌లో 73 మంది విద్యార్థులు ఉంటు న్నారు. గత ఏడాదికంటే ఈ ఏడాది పది మంది పైగా విద్యార్థులు పెరిగారని అధికారులు చెబుతున్నారు.



కాళ్ళలో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో భోజనం చేస్తున్న విద్యార్థులు

వసతులున్నా ఆసక్తి కరువు

కాళ్ళ (ఆంధ్రజ్యోతి) ఒకప్పుడు ఎంతో పేరు ప్రఖ్యా తులు ఉండి మండలంతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులతో కళకళలాడుతూ ఉండే కాళ్ళ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం నేడు విద్యా ర్థులు లేక వెలవెలబోతున్నది. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడగగా సన్న బియ్యంతో వండిన అన్నం, కూర, సాంబార్, పెరుగు చాలా బాగుందంటూ ఆనం దంతో తెలిపారు. విశాలమైన భవనంలో చదువుతో పాటు ఆటలాడుకోవడానికి చాలా అనువుగా ఉంద న్నారు. అంతే కాకుండా నేలపై నిద్రించకుండా స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఏర్పాటు చేసిన మంచాలు చాలా బాగున్నాయన్నారు. అయితే వర్షం వచ్చినప్పుడు హాస్టల్ ప్రాంగణం చిత్తడిగా ఉండి ఇబ్బందిగా ఉంటుం దని తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే తనయుడు భరత్ ఇటీవల వచ్చినప్పుడు తెలపడంతో ప్రాంగణాన్ని మెరక చేయిస్తానని తెలిపారన్నారు. ఇన్‌ఛార్జి హాస్టల్ వా ర్డెన్ పి. సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం వసతి గృహంలో 32 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై తక్కువ రోజులే అవ్వడంతో ఇంకా ప్రవేశాలు పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు.

వసతులు భేష్..

ఏలూరు రూరల్ (ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని సాంఘిక, సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తు న్నారు. ఏలూరు అమీనాపేట బాలికలు, పెద్దరైల్వేస్టేషన్ సమీపం లోని బాలుర వసతి గృహాలు ప్రస్తుత భవనాలకు మరమ్మతులు చేశారు. వసతి సదు పాయంతో పాటు, సన్నబియ్యంతో భోజనం, మరుగుదొడ్లు బాగున్నాయని విద్యార్థులు పేర్కొన్నారు.



ఆటో నడుపుతున్న అంకునూరి మార్తమ్మ

ఆత్మస్థైర్యంతో ముందడుగు..

లింగపాలెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆమె సాధారణ కుటుంబానికి చెందిన మహిళ. వివాహమై ఒక కుమార్తె ఉంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. అనుకోకుండా ఆమె భర్త కిడ్నీ వ్యాధితో చనిపోవడంతో కుటుంబ భారం ఆమెపైనే పడింది. అయినా కుంగిపోలేదు. ఆటో నడుపుతూ ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసింది. ఎంతోమంది మహిళలకు ఆదర్శంగా నిలిచింది. లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన అంకునూరి మార్తమ్మకు ఒక కుమార్తె ఉంది. ఎనిమిదేళ్ల క్రితం ఆమె భర్త చనిపోయాడు. రూ.10 లక్షల వరకు అప్పు అవడంతో ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ కష్టతరమైంది. ఉన్న ఇల్లు కూడా అమ్ముకోవాల్సి వచ్చింది.ఆర్థికంగా అనేక సమస్యలు చుట్టుముట్టాయి. కుమార్తెను ఉన్నత చదువులు చదివించాలనే ఆశతో కూలిపనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకోవడం మొదలుపెట్టింది. కూలి పనులు కూడా సరిగా దొరక్కపోవడం, ఆదాయం అంతంత మాత్రమే కావడంతో పూటగడవటం కూడా కష్టమయ్యేది. రెండేళ్ల క్రితం ఆమె డ్వాక్రా గ్రూప్‌లో ఉన్నతి పథకం ద్వారా మూడు లక్షల రుణం తీసుకుంది. ఆ డబ్బుతో ఆటో కొనుగోలు చేసి డ్రైవింగ్‌లో శిక్షణ పొందింది. ఇప్పుడు సొంతంగా ఆటో నడుపుతూ జీవనోపాధి కల్పించుకుంది. మొదట్లో కొంచెం భయంభయంగా ఉన్నా అన్నిటినీ అధిగమించి ఆ తర్వాత ఆటో నడపడంలో నైపుణ్యం సాధించానని ఆమె చెప్పింది. మొదట్లో తన ఆటో ఎక్కాలంటే ప్రయాణికులు భయపడేవారని తర్వాత తనకు సహకరిస్తున్నట్లు తెలిపింది. రోజుకు పదిగంటలు కష్టపడితే ఖర్చులు పోను నాలుగు వందల నుంచి ఐదు వందల వరకు మిగులుతాయి.. ఇటీవల కుమార్తెకు వివాహం చేసాను.. నాలుగు లక్షల వరకు అప్పు ఉంది.. ప్రభుత్వం తనకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరు చెయ్యాలని, ఇంటిస్థలం, ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని మార్తమ్మ కోరుతోంది.



జంగారెడ్డిగూడెంలో గంగానమ్మకు ప్రదర్శనగా బోనాలు తీసుకువస్తున్న భక్తులు

అమ్మవార్లకు ఆషాఢ బోనాలు

జంగారెడ్డిగూడెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత గంగానమ్మకి ఆషాడమాస సంద ర్భంగా భక్తులు శుక్రవారం బోనాలు సమర్పిం చారు.జంగారెడ్డిగూడెం జడ్పీ బాలుర హైస్కూల్ వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయం నుంచి రెండు వందల మంది గంగానమ్మ ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం బోనాలు తీసుకువచ్చిన మహిళా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. శుక్రవారం అమ్మవారు శాకంబరి దేవిగా భక్తులకు దర్శన మిచ్చినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మకు..

బుట్టాయగూడెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రెడ్డిగణపవరంలో ఉన్న కనకదుర్గమ్మకి మహి ళలు శుక్రవారం ఆషాఢ బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. బండార్లగూడెం నుంచి బయలుదేరిన మహి ళలు గ్రామంలోని ప్రధాన వీధుల్లో పర్యటిస్తూ అన్ని ఆలయాలను సంద ర్శించి అమ్మవారి ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించారు. బండార్లగూడెంకు చెందిన తాతి కౌసల్య, దాసరి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో భక్తులు బోనాలు సమర్పించారు.





అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు.. శాకంబరీ దేవిగా కనకదుర్గమ్మ

మావుళ్లమ్మ ఆలయంలో ధాన్యలక్ష్మి పూజ

భీమవరం టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): భీమవరం మావుళ్ళమ్మ ఆలయంలో ఆషాఢ బహుళ పాడ్యమి పురస్కరించుకుని ధాన్యలక్ష్మి పూజను ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ నిర్వహించారు అమ్మవారి ముఖ మండపంలో ధాన్యం రాశులను పోసి వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. రైతులకు, భక్తులకు పూజ చేసిన ధాన్యం, పసుపుకొమ్ము అందజేశారు. వ్యవ సాయ, వృత్తి, వ్యాపారాలు వృద్ధి పొంది అందరూ బాగుండాలని ధాన్యలక్ష్మి పూజ నిర్వ హించినట్టు ఆలయ ఈవో బుద్ద మహాలక్ష్మి నగేష్ తెలిపారు.



అమ్మవారి ఆలయంలో ధాన్యలక్ష్మి పూజ నిర్వహిస్తున్న అర్చకులు



అమ్మవారికి ఆషాఢం సారె తెచ్చిన రాట్నాలకుంట, రాయన్నపాలెం గ్రామస్థులు

రాట్నాలమ్మకు సారె

పెదవేగి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఆడ పడుచు సంతోషంగా ఉంటే ఆ ఇంట్లో ఆనందం తాండవిస్తుందని, ఆ కుటుంబం మొత్తం సుఖ సంతోషాలతో ఉంటుందని పెద్దలు చెప్తారు. రాట్నాలమ్మకు పుట్టింటి నుంచి సారెను సమ ర్పిస్తే ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉంటారని భక్తులు శ్రీరాట్నాలమ్మ వారికి పిండివంటలు, పండ్లు, చీరలతో సారె సమర్పించారు. పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మకి రాట్నా లకుంట, రాయన్నపాలెం గ్రామానికి చెందిన మహిళలు సారె సమర్పించారు. అమ్మ సంతో షిస్తుందని, సమృద్ధిగా వర్షాలు పడి, పంటలు పుష్కలంగా పండి, గ్రామం సుభిక్షంగా ఉం టుందని గ్రామస్తులు చెప్తున్నారు.

తీరిన తిరుపతి రిజర్వేషన్ కష్టాలు

నరసాపురం నుంచి మూడు రైళ్లు



నరసాపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి):గత నెల వరకు తిరుపతి వెళ్లాలంటే టిక్కెట్లు దొరక్క ప్రయాణికులు నానా కష్టాలు పడే వారు. రెగ్యులర్ రైలుకు టిక్కెట్ లేకపోతే తత్కాల్‌పైనే ఆధారపడాల్సి వచ్చేది. అదీ దొరక్కపోతే విజయవాడ వెళ్లి అక్కడి నుంచి తిరుపతి వెళ్లేవారు. నేడు ఆ కష్టాలు చాలా వరకు తీరాయి. నరసాపురం నుంచి రోజూ నడిచే ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌తోపాటు అదనంగా తిరుపతికి రెండు స్పెషల్ రైళ్లు నడుస్తున్నాయి. ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటలకు నరసాపురం నుంచి వెళ్లే ధర్మవరం ఎక్స్‌ప్రెస్ తిరుపతి మీదుగా వెళుతుంది. దీనితోపాటు ప్రతి సోమవారం 3.30 గంటలకు తిరుపతికి ప్రత్యేక రైలు(07123), తాజాగా కొత్తగా అరుణాచలం (తిరువన్నామలై) రైలును తిరుపతి మీదుగా నడుపుతున్నారు. ఇది ప్రతి బుధవారం నరసాపురం నుంచి మధ్యాహ్నం ఒకంటి గంటకు బయలుచేరుతుంది. తిరుగు ప్రయాణంలో తిరుపతిలో మధ్యాహ్నం 2.30కి బయలుదేరుతుంది.



తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌లో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి వర్మ

వందే భారత్‌కు గూడెంలో హాల్ట్

రూ.45 కోట్లతో స్టేషన్ అభివృద్ధి : కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

తాడేపల్లిగూడెం, జూలై 11(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌ను రూ.45 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడించారు. ఇప్పటికే రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. దీనికి అదనంగా మరో రూ.18 కోట్లు మంజూరు చేశామన్నారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో గుంతకల్లు వెళ్లేందుకు శుక్రవారం సాయంత్రం ఆయన తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, బీజేపీ శ్రేణులు స్వాగతం పలికారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. తాడేపల్లిగూడెంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌కు లెటర్ ఇచ్చానని అది త్వరలోనే జరుగుతుందని రైల్వే ఉన్నతాధికారులు తనకు తెలియజేశారని వర్మ పేర్కొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయనంపూడి శ్రీదేవి, మాజీ అధ్యక్షుడు నార్ని తాతాజీ, పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీను, బాలకృష్ణ, రామగని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

13న ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

చింతలపూడి, జూలై 11(ఆంధ్రజ్యోతి):గుంటూరు జిల్లా తాడేపల్లి సీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఈ నెల 12న జరగాల్సిన ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం 13వ తేదీ ఆదివారానికి మార్పు జరిగిందని గెజిటెడ్ ఉద్యోగులు ఈ విషయం గమనించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు కలపాల సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ 13న వస్తున్నట్టు సమాచారం ఉండడంతో ఈ మార్పు చేసినట్టు తెలిపారు. ఉద్యోగ మిత్రులందరూ దీనిని గమనించి 13న రావాలని ఆహ్వానించారు.

ఉద్యోగ సర్వీసుల రెగ్యులరైజేషన్ ప్రాసెసింగ్‌లో వున్న వారిని కౌన్సెలింగ్‌లో చేర్చాలి

ఏలూరు అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎంపీహెచ్‌ఏ (మేల్) ఉద్యోగులను వర్క్ అడ్జస్ట్‌మెంట్/రీడిప్లాయ్‌మెంట్ కింద ఎన్‌వీబీడీసీపీ పథకంలో నియమించేందుకు నిర్వహించనున్న కౌన్సెలింగ్‌లో గతేడాది జీవో 114 ప్రకారం ఉద్యోగ సర్వీసుల క్రమబద్ధీకరణ ప్రాసెసింగ్‌లో వున్న వారిని పరిగణనలోకి తీసుకోవాలని అభ్యర్థిస్తూ ఆచంట వేమవరం పీహెచ్‌సీ పరిధిలోని కొడమంచిలి సబ్‌సెంటర్ వైద్య ఉద్యోగి ఎం.విజయప్రసాద్ నేతృత్వంలోని బృందం కలెక్టర్, డీఎంహెచ్‌వోలకు వినతి పత్రాలను అందజేసింది. 2024లో యాక్టు 30 ప్రకారం తమకు రెగ్యులరైజేషన్ జరిగినప్పటికీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ప్రాసెస్ నిలిచిపోయిందని వివరించారు.

చేబ్రోలు సర్పంచ్ సునీతకు జాతీయస్థాయి అవార్డు



ఉంగుటూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలు సర్పంచి రాంధే లక్ష్మీ సునీత జాతీయస్థాయిలో సర్పంచ్ సంవాద్ పోటీలలో ప్రథమస్థానం పొందారు. భారత నాణ్యతా మండలి దేశంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లకు మెరుగైన పాలన, గ్రామాభివృద్ధి, సాంకేతికత, సమాచార మార్పిడి వంటి అంశాలపై ప్రతి నెలా 'సర్పంచ్ సంవాద్' పేరిట ఆన్‌లైన్‌లో ఈ పోటీలు నిర్వహించి వారిని ప్రోత్సహిస్తున్నారు. జూన్ నెలకు సంబంధించి చేబ్రోలు గ్రామాన్ని ఏలూరు జిల్లా నుంచి సుప్రీం లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా ప్రకటించడంతో జిల్లా కలెక్టర్ సహా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సందర్శించి గ్రామాభివృద్ధికి సంబంధించి ఈ అప్లికేషన్‌లో పొందు పరిచారు. ఈ అవార్డు ద్వారా రూ.35 వేల నగదు అందిస్తారు.

నేడు ఏలూరు రానున్న హైకోర్టు జడ్జి

ఏలూరు క్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి):హైకోర్టు జడ్జి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి ఈ నెల 12వ తేదీ ఉదయం 9 గంటలకు ఏలూరు రెవెన్యూ అతిథి గృహానికి చేరుకోనున్నారు. అనంతరం 10 గంటలకు జిల్లా కోర్టు ఆవరణలో జరిగే న్యాయవాదుల సదస్సులో పాల్గొననున్నారు.

కోర్టులో వ్యర్థ పేపర్ల కొనుగోలుకు టెండర్లు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కోర్ట్‌లో వ్యర్థపేపర్లు కొనుగోలుకు సీల్డ్ టెండర్లు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీల్డ్ టెండర్ కొటేషన్లు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్ట్, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు చిరునామాకు జూలై 16వ తేదీలోగా పంపాలన్నారు.



పెనుమంట్ర తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు.. వివిధ సంఘాల నాయకులు

పెనుమంట్ర సర్పంచ్ నిరాహార దీక్ష భగ్నం

న్యాయం చేయాలంటూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన

పెనుమంట్ర, జూలై 11(ఆంధ్రజ్యోతి):'మా స్కూల్ మాకు కావాలి' అంటూ పెనుమంట్ర సర్పంచ్, ఆమె భర్త శుక్రవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయం వద్ద తలపెట్టిన ఆమరణ నిరాహార దీక్ష యత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. దీక్ష కోసం వేసిన వేదిక, షామియానా, కుర్చీలను తొలగించారు. దీంతో సర్పంచ్ దంపతులు, 'ఎల్.ఈ' స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ సంఘాల నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. పాఠశాల పిల్లలను మరో పాఠశాలలో విలీనం చేయడానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నా అధికారులు ఉదాశీనంగా ఉన్నారని, ఇప్పుడు చేపట్టిన దీక్షను భగ్నం చేశారని, తమకు న్యాయం చేసే వరకు ఇక్కడే ఉంటామని స్పష్టం చేశారు. ఎంఈవో వచ్చి సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జడ్పీటీసీ కర్రి సుభాషిణి, పెనుమంట్ర సర్పంచ్ ప్రియాంక, వైసీపీ నాయకులు తహసీల్దార్‌తో చర్చించారు. ఎంఈవో-2పై సమగ్ర విచారణ జరిపించే విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తానని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గుప్పుమంటున్న గంజాయి

- కైకలూరు ప్రాంతంలో పెరుగుతున్న గంజాయి కల్చర్
- నిర్మానుష ప్రాంతాలే అడ్డా
- ఉజ్వల భవిష్యత్తు కోల్పోతున్న యువకులు
- అధికారులు ఉక్కుపాదం మోపాలంటున్న స్థానికులు



ఎదిగొచ్చిన పిల్లలు కుటుంబానికి ఆసరాగా నిలుస్తారని తల్లిదండ్రులు వారిపై ఎన్నో ఆశలు పెట్టుకుంటే చాలామంది మత్తుకు బానిసలుగా మారి పెడదోవ పడుతున్నారు. వీరిలో చాలా మంది గంజాయికి బానిసలై మత్తులో కుటుంబీకులను వేధించడంతోపాటు నేరాలు చేసేందుకు వెనుకాడడం లేదు.

కైకలూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి):జనావాసాలకు దూరంగా నిర్మానుష్య ప్రదేశాలను గంజాయి సేవించడానికి యువకులు అడ్డాగా మార్చుకుంటున్నారు. గంజాయి మత్తులో వీరు ఎప్పుడు ఎవరిపై తెగబడతారోనని భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై వెళుతూ వెర్రి కేకలు వేస్తున్నారు. వీరిని అడ్డుకునేందుకు పోలీసులు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఏదో పక్క నుంచి గంజాయి రవాణా సాగుతూనే ఉంది. ఇటీవల ఎమ్మెల్యేలతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సైతం గంజాయి సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి అరికట్టాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ రవాణాను అరికట్టాలని ఎమ్మెల్యే సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడికక్కడే పటిష్టమైన తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ గంజాయి రవాణా అవుతూనే ఉంది. కైకలూరు పట్టణంలో బహిరంగ ప్రదేశాలైన జగనన్న కాలనీ లే అవుట్ ఖాళీ ప్రదేశాలను, 100 ఎకరాల చేపల చెరువు సమీపంలోనూ, దానెగూడెం రోడ్డులోని ఇళ్లవెనుక ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఉదయం 10 గంటల నుంచి అర్థరాత్రి వరకు అనేక బ్యాచ్‌లుగా చేరి గంజాయి, మద్యం సేవిస్తున్నారు. ఆ సమీపంలో నివాస గృహాలు ఉండడంతో మహిళలు, చిన్నపిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. యువకులు గుంపులు గుంపులుగా చేరి నిత్యం గంజాయిని తాగుతున్నారు. కైకలూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో, రైల్వే ట్రాక్ వెంబడి, మార్కెట్ యార్డ్‌లోనూ, కైకలూరులోని ఓ మంచినీటి చెరువుగట్టుపై, గోపవరం గ్రామంలో కొత్తగా నిర్మాణం చేస్తున్న బైపాస్ రోడ్డులో ఎక్కువగా యువకులు గంజాయి సేవిస్తూ సంచరిస్తున్నారు. మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల జరిగిన చోరీలలో కూడా యువకులు గంజాయి సేవించి దొంగతనాలకు పాల్పడినట్లుగా ఆయా గ్రామాల్లో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే కలిదిండి మండలంలో గంజాయి వ్యాపారం పెద్దఎత్తున కొనసాగుతోంది. చిన్న చిన్న పొట్లాలుగా చేసి రూ.50, రూ.100లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. గంజాయి ఏలూరు, ఆకివీడు, భీమవరం, విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి తీసుకు వస్తున్నారు. ఈ గంజాయి రవాణాను గుట్టుచప్పుడు కాకుండా కలిదిండి మండలంలో కొంత మందికి అంది స్తున్నారు. తాడినాడ, ఉప్పుటేరు పరి వాహక ప్రాంతాల్లోనూ గంజాయి విచ్చలవిడిగా రవాణా అవుతోంది. అక్కడి నుంచి ఆ చుట్టుపక్కల ప్రాంతాల యువకులతో పాటు కైకలూరు ప్రాంతానికి సైతం సరఫరా అవుతోంది. దీంతో యువత ఉజ్వల భవిష్యత్తును వదిలివేసి మత్తుకు బానిసలవుతున్నారు.

పోలీసులు దృష్టి సారించాలి...

గంజాయిని సేవిస్తున్న యువకులకు స్థానికంగా ఎవరు విక్రయిస్తున్నారు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారెవరు? అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. మత్తుకు బానిసలవుతున్న యువతపై పోలీసులు నిఘా ఉంటే వారిలో మార్పు వచ్చే అవకాశం ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

మెగా పీటీఎంలో ఏలూరు జిల్లాకు ద్వితీయ స్థానం!

పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు జనప్రవాహం

ఏలూరు అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్(పీటీఎం 2.0)లో ఏలూరు జిల్లాకు రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానం లభించింది. ప్రథమస్థానం కోనసీమ జిల్లాకు లభించింది. ప్రణాళికాబద్ధంగా పీటీఎం నిర్వహణను అందరినీ సమన్వయపరుచుకుని విజయవంతం చేయడంపై జిల్లా అధికారులకు ప్రభుత్వ ప్రశంసలు లభించాయి. మరోవైపు ఉపాధ్యాయులు సైతం ఉత్సాహంగా పీటీఎం ఏర్పాట్లలో చురుకుగా పాల్గొని ఎక్కడా లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవడం వల్లే ఇది సాధ్యమైందని ఉన్నతాధికారులు వ్యాఖ్యానించారు. ఇటీవలికాలంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఏకకాలంలో ఇంతభారీగా నిర్వహించిన కార్యక్రమం ఏదీలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

పాఠశాలలకు లక్షలసంఖ్యలో తాకిడి!

గురువారం ఉదయం 9గంటలకు మొదలైన మెగా పీటీఎం కార్యక్రమాలు నిర్ణీత షెడ్యూల ప్రకారం మధ్యాహ్నం ఒంటిగంటకు అందరూ సహపంక్తి భోజనం చేయడంతో ముగియాల్సి ఉండగా, పలుచోట్ల సాయంత్రం 4 గంటల వరకు కొనసాగినట్లు జిల్లాకేంద్రానికి సమాచారం అందింది. తమ పిల్లల ప్రగతి, సామర్థ్యాలను తెలుసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలకు 1,68,894 మంది తల్లితండ్రులు తరలివచ్చినట్లు అధికారికంగా శుక్రవారం ప్రకటించారు. మొత్తం 2,225 పాఠశాలలకు గాను 2173 స్కూళ్లలో మెగా పీటీఎం కార్యక్రమాలను నిర్వహించగా టీచర్లు 7275 మంది, బాలబాలికలు 2,23,661 మంది, అతిథులు 1,01,604 మంది హాజరయ్యారు. మొత్తం మీద 99.46 శాతం పాఠశాలల్లో పీటీఎం విజయాన్ని నమోదు చేసుకుంది. పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల ఫోటోలు, వీడియోలను లీప్ యాప్‌లో అప్‌లోడ్‌చేసారు.

జూనియర్ కళాశాలల్లోనూ అదే జోరు!

జిల్లాలో మొత్తం 140 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యతో నిర్వహించే 26 హైస్కూల్ ప్లస్‌లలో పీటీఎం కార్యక్రమాలు ఆయా ఉన్నత పాఠశాలలతో పాటే జరిగాయి. ఇక మిగిలిన జూనియర్ కళాశాలల్లో పీటీఎం జరిగిన 108 కాలేజీల్లో 14,831 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గాను 13,160 మంది, తల్లిదండ్రులు 8,716 మంది పాల్గొన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17,691 మందికి పీటీఎం కార్యక్రమాలకు 14,923 మంది, తల్లితండ్రులు 9,422 మంది హాజరయ్యారు. కళాశాలలకు సంబంధించి పీటీఎం కార్యక్రమాల ఫోటోలు, వీడియోలను కాలేజీ లాగిన్‌ద్వారా అప్‌లోడ్ చేశారు.



పట్టిసీమ నుంచి 7,788 క్యూసెక్కుల విడుదల

పోలవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7,788 క్యూసెక్కుల జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు ఈఈ యేసుబాబు శుక్రవారం తెలిపారు. గోదావరి నీటిమట్టం 18 మీటర్లకు పైబడి ఉండడంతో 22 మోటార్లు 22 పంపుల ద్వారా నీటి విడుదల చేసినట్లు తెలిపారు. కృష్ణా, ఉమ్మడి పశ్చిమ డెల్టాల సాగునీటి అవసరాల రీత్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మోటార్లు, పంపుల సంఖ్య పెంచామన్నారు.

గంజాయి నిర్మూలనకు ఆపరేషన్ విజయ్ : ఏఎస్పీ



పోలీసు జాగిలంతో తనిఖీలు

ఏలూరు క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, మత్తు పదార్థాల నిర్మూలనకు ఆపరేషన్ విజయ్‌ని నిర్వహిస్తున్నామని దీనిలో భాగంగానే ఆకస్మికంగా రైళ్లల్లో తనిఖీలు కొనసాగిస్తున్నామని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు చెప్పారు. ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో శుక్రవారం పలు రైళ్ళను తనిఖీలు చేశారు. పోలీసు జాగిలాలతోనూ, జీఆర్పీ, ఆర్పీ ఎఫ్, ఈగల్ టీమ్ పోలీసు జాగిలాలతో తనిఖీలు కొనసాగించారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా దిశ నిర్దేశంలో ఈగల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికృష్ణ ఆదేశాలను అనుసరించి ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఉత్తర్వులతో ఒడిసా వైపు నుంచి వస్తున్న రైళ్ళల్లో ప్రత్యేక తనిఖీలు కొనసాగిస్తున్నామని ఏఎస్పీ తెలిపారు. విద్యా సంస్థల పరిసరాల్లో యువతకు భద్రత కల్పించడం, వారి భవిష్యత్తును రక్షించడమే ఆపరేషన్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఒడిసా రాష్ట్రం నుంచి గంజాయి ఏలూరు మీదుగా రైళ్ళల్లో రవాణా జరుపుతున్నట్లు సమాచారం ఉండడంతో ఆకస్మికంగా ఒడిసా నుంచి వచ్చే రైళ్ళను తనిఖీలు చేయిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలని వారు ఏమైనా మత్తు పదార్థాలకు అలవాటు పడినా, గంజాయి వినియోగించినట్లు గుర్తించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయరని వారికి కౌన్సిలింగ్ చేసి డీ అడిక్షన్ సెంటర్లకు పంపించడం జరుగుతుందన్నారు. ఈగల్ టీమ్ ఆర్ఎస్ఐ బి ఉదయభాస్కర్, హెడ్ కానిస్టేబుల్ బి. సూర్యచక్ర, జీఆర్పీఎస్ఐ పి సైమన్, కానిస్టేబుల్ విజయ్, ఆర్పీఎఫ్ ఎస్ఐ వి ధనుష్, పోలీస్ సిబ్బంది, పోలీసు జాగిలాల బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

క్రైం సమాచారం

చికిత్స పొందుతూ మహిళ మృతి

తణుకు రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి):తణుకు రూరల్ మండలం దువ్వ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని మహిళ ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తణుకు రూరల్ ఎస్ఐ కె.చంద్రశేఖర్ తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని మహిళ వయసు 65 ఏళ్లు ఉంటాయన్నారు. వివరాలు తెలిసిన వారు తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

రొయ్యల చెరువులో విష ప్రయోగం

- రూ.6 లక్షల నష్టం.. కేసు నమోదు చేసిన పోలీసులు

పెదపాడు, జూలై 11(ఆంధ్రజ్యోతి):తన నాలుగు ఎకరాల రొయ్యల చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేయడంతో రొయ్యలు చనిపోయి రూ.6 లక్షల నష్టం జరిగిందంటూ పెదపాడు మండలం వడ్డిగూడెం గ్రామానికి చెందిన ఘంటశాల సుబ్బరాజు పెదపాడు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చెరువును పరిశీలించి వివరాలు సేకరించారు. పెదపాడు ఏఎస్ఐ గజపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగర పంచాయతీ మేనేజర్ విధులకు ఆటంకం

- ఇద్దరిపై కేసు నమోదు

ఆకివీడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో ఉన్న తన స్థలానికి పన్ను రశీదు ఇవ్వాలంటూ నగర పంచాయతీ మేనేజర్‌తో ఇద్దరు వ్యక్తులు గొడవపడ్డారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మేనేజర్ దంగేటి వెంకటేశ్వరరావు విధులు నిర్వహిస్తుండగా స్థానిక ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ మస్తాన్‌వలీ, ఎండీ బాసిత్ వెళ్లి స్థలానికి పన్ను రశీదు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నావంటూ మేనేజర్‌తో గొడవపడ్డారు. ఆ ఇరువురు మేనేజర్‌పై అసభ్యకరంగా మాట్లాడి విధులకు ఆటంకం కలిగించడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం ఎస్ఐ హనుమంతు నాగరాజు శుక్రవారం కేసు నమోదు చేశారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ సీఐ జి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ బండారు నాని కేసు నమోదు చేశారు. ఏలూరు పత్తేబాదకు చెందిన చేపాటి జ్యోతికి 2012లో ఈశ్వరరావుతో వివాహమైంది. ఆ సమయంలో ఐదు లక్షలు కట్నం, కానుకలు అందజేశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె 2024లో సీరియల్స్‌లో జూనియర్ ఆర్టిస్టుగా చేరి సీరియల్స్‌లో పని చేస్తున్నారు. ఈనెల 7వ తేదీన ఏలూరులోని తన తల్లిదండ్రుల వద్దకు వచ్చిన ఆమెను ఈశ్వరరావు కట్నం కోసం వేధింపులకు గురి చేసి దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు

ఏలూరు క్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి):ఇంటి నుంచి ఒక వివాహిత వెళ్లిపోయిందని భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏలూరు టూటౌన్ పోలీసులు తెలిపారు. ఏలూరుకు చెందిన చిట్టూరి నాగలక్ష్మికి భర్త రాటాలు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈనెల 10వ తేదీ రాత్రి 8 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం వెతికినప్పటికి ఆచూకీ కానరాకపోవడంతో రాటాలు ఏలూరు టూటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదుచేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యవర్తిత్వంతో ఇరుపక్షాలు గెలిచినట్టే

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి



ఏలూరు ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తి శ్రీదేవి, న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది

ఏలూరుక్రైం, జూలై11(ఆంధ్రజ్యోతి): ఇరుపక్షాల మధ్య ఉన్న అగాధాన్ని తొలగించడానికి మధ్యవర్తిత్వం ఎంతో దోహదపడుతుందని మధ్యవర్తిత్వంతో కేసులను పరిష్కరించుకుంటే ఇరుపక్షాల వారు గెలుపొందినట్టేనని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. మధ్యవర్తిత్వం వారోత్సవాల్లో భాగంగా ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం ఉదయం అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ర్యాలీలో ఆమెతోపాటు న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా కోర్టు నుంచి ఫైర్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి తిరిగి కోర్టు వరకు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారుల మధ్య నెలకొన్న తగవులను త్వరితగతిన పరిష్కరించడానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 40 మంది న్యాయవాదులకు 40 గంటలపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యత పెంపొందించామన్నారు. వారు ఇరుపక్షాలకు మధ్యవర్తిత్వం వహించి సమస్య పరిష్కారానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తారని ఇరుపక్షాలు అంగీకారమైతే లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించి అవార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవార్డుపై ఎలాంటి అప్పీలు ఉండదన్నారు. ఇరుపక్షాల్లో ఏ ఒక్కరికి అంగీకారం లేకపోయిన పరిష్కారం ఉండదని, వారు అంగీకరిస్తేనే అవార్డు జారీ చేస్తామన్నారు. ఇరుపక్షాలు విజయం సాధించినట్లేనని చెప్పారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు మధ్యవర్తిత్వంపై వారోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జి యు. ఇందిరాప్రియదర్శిని, ఏడో అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులికృష్ణ, అదనపు సీనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీ కృష్ణసాయితేజ, బార్ అధ్యక్షుడు కోనే సీతారామ్, పలువురు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని మృతదేహానికి ఎట్టకేలకు పోస్టుమార్టం

- నగదుతోపాటు కుటుంబ సభ్యునికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం హామీతో ఆందోళన విరమణ

భీమడోలు, జూలై 11(ఆంధ్రజ్యోతి):పోలసానపల్లి గురుకుల కళాశాలలో అనుమానాస్పదంగా మృతిచెందిన ఇంటర్ విద్యార్థిని లేళ్ల మానస(16) మృతదేహానికి ఎట్టకేలకు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. పోలసానపల్లి బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని గురువారం మృతి చెందిన సంగతి తెలిసిందే. బాలిక మృతి అనంతరం తమ కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు, తల్లిదండ్రులు భీమడోలు సామాజిక ఆసుపత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. అధికారులు, బంధువులతో గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు చర్చలు జరిపినప్పటికీ ఆందోళన కొనసాగించారు. ఎట్టకేలకు ఆర్‌డీవో అచ్యుత్ అంబరీష్, ఇతర అధికారులు రూ.3 లక్షల నగదు, మృతురాలి కుటుంబ సభ్యునికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చేలా ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. గురుకుల పాఠశాలలో మృతి చెందిన బాలిక మృతిపై ప్రాథమిక విచారణ నిర్వహించి ఉన్నతాధికారుల నివేదించామని, త్వరలో దీనిపై పూర్తిస్థాయి విచారణకు ప్రత్యేక అధికారిని నియమిస్తారని తహసీల్దార్ రమాదేవి తెలిపారు.



బాధితురాలిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చిన హోంగార్డు నాగరాజు

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన ఒక మహిళను రోడ్డు సేఫ్టీ వాహనంలో ఆసుపత్రికి హోంగార్డు తరలించి ఆమె ప్రాణాలు కాపాడారు. దెందులూరు మండలం సోమవరప్పాడుకు చెందిన ఎం.గీత తన ద్విచక్ర వాహనంపై ఏలూరుకు వస్తుండగా సోమవరప్పాడు బ్రిడ్జి వద్ద రోడ్డు తడిచిపోయి నీళ్లు ఉండడం వల్ల బైక్ జారీ ఆమె తీవ్ర గాయాలకు గురయ్యారు. అక్కడే రోడ్డు సేఫ్టీ పోలీసు వాహన విధుల్లో ఉన్న హోంగార్డు నాగరాజు గమనించి ఆ మహిళను వాహనంలో ఎక్కించుకుని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరోవైపు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. హోంగార్డును జిల్లా పోలీసు అధికారులు అభినందించారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, జూలై 11(ఆంధ్రజ్యోతి):చేపల చెరువులో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి పెదపాడు వద్ద బొలేరా వాహనాన్ని స్వాధీనం చేసు కున్నామని పెదపాడు ఏఎస్ఐ గజపతిరావు తెలిపారు. చికెన్ వ్యర్థాలను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, వాహన యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

ఆటోలో బ్యాగ్ మర్చిపోయిన విద్యార్థిని

- గంటలో అప్పగించిన పోలీసులు



విద్యార్థినికి బ్యాగ్ అందజేస్తున్న త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు

ఏలూరుక్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి):ఆటోలో ప్రయాణిస్తున్న ఒక విద్యార్థిని బ్యాగ్ పోగొట్టుకున్నట్టు త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావుకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గంట వ్యవధిలోనే సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఆ బ్యాగ్‌ను గుర్తించి బాధితురాలికి అందించారు. ఏలూరు సీఆర్ఆర్ మహిళా కళాశాలలో డిగ్రీ చదువుతున్న పామర్తి వెంకట కృష్ణవేణి కాలేజీ నుంచి కొత్తబస్టాండ్ వరకు శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు ఒక ఆటో ఎక్కి బస్టాండ్ వద్దకు వచ్చాక తన బ్యాగ్‌ను మర్చిపోయింది. బ్యాగ్‌లో విలువైన వస్తువులు, నగదు ఉన్నాయి. బాధితురాలు వెంటనే ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదుచేసింది. సీఐ వి.కోటేశ్వరరావు వెంటనే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. విద్యార్థిని ఎక్కిన ఆటోను గుర్తించారు. ఆటో డ్రైవర్ పోలమూరి నాగేశ్వరరావుగా గుర్తించి అతడికి పోలీసులు ప్రశ్నించారు. బ్యాగ్ అతడి వద్దే ఉండడంతో దానిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌లో బాధితురాలికి గంట వ్యవధిలోనే అప్పగించారు. బాధిత విద్యార్థిని, ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

'డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి'

కామవరపుకోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధి ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ సీహెచ్ సుమ తెలిపారు. శుక్రవారం తడికలపూడి పీహెచ్‌సీ సిబ్బంది డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నివాస ప్రాంగణాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమలు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. చింతలపూడి ఎస్ఈవో ప్రసాద శ్రీనివాస్‌తోపాటు పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలి'

లింగపాలెం, జూలై11(ఆంధ్రజ్యోతి): సొంతభూమి కలిగిన రైతులందరూ అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో వి.ప్రదీప్‌కుమార్ సూచంచారు. లింగపాలెం వ్యవసాయ కార్యాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై పలు సూచనలు చేశారు. ఈకేవైసీకి ఈనెల పదమూడో తేదీ వరకు ప్రభుత్వం గడువు పెంచిందని, ఇంకా మిగిలిన రైతులు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

రైతుల అభివృద్ధికి కో-ఆపరేటివ్ బ్యాంకులే కీలకం


చింతమనేనికి బొకే అందిస్తున్న డాక్టర్ పసుమర్తి మధు

దెందులూరు/పెదవేగి, జూలై 11(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధికి కో-ఆపరేటివ్ బ్యాంకుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం దెందులూరులో జోగన్నపాలెం కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడిగా టీడీపీ సీనియర్ నాయకులు, జోగన్నపాలెంకు చెందిన డాక్టర్ పసుమర్తి మధుబాబును రెండోసారి నియమించారు. గాలాయగూడెం కో- ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడిగా జనసేన పార్టీ పంచాయతీ వార్డు మెంబర్‌గా ఉన్న పూజారి వెంకటరత్నం నాయుడు నియమితులైన సందరభంగా చింతమనేనిని ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి బొకేను అందించిన కృతజ్ఞతలు తెలిపారు. సీతంపేట బ్యాంక్ అధ్యక్షుడు యలమర్తి శ్రీనివాస్, పోతునూరు అధ్యక్షుడు బోడేటి మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికి 'తల్లికి వందనం' లబ్ధి

అర్హత కలిగిన ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం అందించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల కార్యాలయంలో సంక్షేమ పథకాల అమలుపై శుక్రవారం పలు శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

● అంకన్నగూడెం దగ్గర పోలవరం కుడి కాలువ నుంచి కొప్పాక ఏటికాలువ సిస్టంకు గోదావరి జలాలను శుక్రవారం పూజలు నిర్వహించి, స్లూయిజ్‌ద్వారా నీటిని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ దాదాపు పది వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుందన్నారు. కార్యక్రమంలో కొప్పాక సొసైటీ చైర్మన్ కొసరాజు వీరవెంకట వరప్రసాద్, సర్పంచ్ పరాశరం భాస్కర దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎస్పీ


సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కిషోర్

ఏలూరు క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది సమస్యలను సత్వరమే పరిష్కార చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. జిల్లాలో పనిచేస్తున్న సివిల్, ఏఆర్, హోంగార్డుల సమస్యలపై శుక్రవారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఆడమిల్లిలో వంతెనను పరిశీలిస్తున్న టీడీపీ శ్రేణులు

ఆడమిల్లిలో కుంగిన పాత వంతెన పరిశీలన

కామవరపుకోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలోని ఆడమిల్లి వద్ద ఇటీవల కుంగిన పాత వంతెన ప్రాంతాన్ని టీడీపీ శ్రేణులు శుక్రవారం సమగ్ర పరిశీలన చేశారు. కుంగిన తీరును పరిశీలించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఏలూరి హరిరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, కామవరపుకోట పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ నెక్కలపు సూర్యనారాయణ, బలుసు సాయి, మిత్రబృందం వంతెన దుస్థితిపై ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

భువనపల్లి హైస్కూలుకు సీలింగ్ ఫ్యాన్ల అందజేత

నిడమర్రు(ఉంగుటూరు), జూలై 11(ఆంధ్రజ్యోతి) : నిడమర్రు మండలం భువనపల్లి గ్రామ జడ్పీ హైస్కూలుకు గణపవరం లయన్స్ క్లబ్ నాలుగు సీలింగ్ ఫ్యాన్లను అందించింది. కార్యక్రమంలో లయన్ ఈపూరి సత్యనారాయణ, వెల్లంకి నరేష్ కుమార్, గ్రామ సర్పంచి కిలారి సత్యవతి, లయన్ రవిబాబు, నాగరాజు, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.


వేలేరుపాడు మండలం ఎద్దువాగు కాజ్‌వేపై చేరిన వరదనీరు

గోదావరి వరద..దూసుకొస్తోంది!

(5వ పేజీ తరువాయి)

సాగింది. గతేడాది జూలై 27న వారంపాటు గోదావరిలో వరద బెంబేలెత్తించింది. అప్పట్లో భద్రాచలం వద్ద 56.9 అడుగుల మేర వరద నీరు చేరింది. ఈ అనుభవాల నేపథ్యంలో జూలై వచ్చిందంటే తీరంలో అంతా గడగడలాడాల్సి వస్తోంది.

అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్

'భద్రాచలం వద్ద గోదావరి నదికి శనివారం తెల్లవారుజామున మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయబోతున్నారు. యంత్రాంగం అప్రమత్తం కావాలి. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ప్రజలెవరూ నదిలోకి వెళ్లవద్దు. చేపల వేట చేయవద్దు. జాగ్రత్తగా ఉండండి' అంటూ కలెక్టర్ వెట్రిసెల్వి కుక్కునూరు, వేలేరుపాడులలో యంత్రాంగాన్ని, స్థానికులను శుక్రవారం రాత్రి అప్రమత్తం చేశారు. సాధ్యమైనంత మేర ప్రసవానికి దగ్గరలో వున్న గర్భిణులను దగ్గరలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలని, వృద్ధులు, పిల్లలు, విభిన్న ప్రతిభావంతులను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని ఆదేశించారు. దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో వరద పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వాసితులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలని వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేశారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని, వాటర్‌ట్యాంకులు సిద్ధం చేయాలని, అత్యవసర సమయంలో వినియోగం నిమిత్తం మోటారుబోట్లు, ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. వరద పునరావాస కేంద్రాల్లో నిత్యావసర సరుకులు, కాయగూరలు సిద్ధం చేయాలన్నారు. వరద నీరు ప్రవహించే కల్వర్టులు, కాజ్‌వేలు, రహదారులను ముందస్తుగా మూసి వుంచడంతోపాటు అవి ప్రజలు దాటకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జంగారెడ్డిగూడెం ఆర్డీవో, ఐసీడీఎస్ పీవోలను ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాల్సిందిగా ఆదేశించారు. వరద ప్రభావిత గ్రామాలైన లచ్చిగూడెం, గొమ్ముగూడెం గ్రామస్తులతో ఐసీడీఎస్ పీవో రాములనాయక్ భేటీ అయ్యారు. పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో నరసింహరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వీరాస్వామి గ్రామాల్లో పర్యటిస్తూ ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.దాచారం పునరావాస కేంద్రంలో విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్‌రాజు చెప్పారు. పునరావాస కేంద్రాన్ని పరిశీలించి విద్యుత్తు సౌకర్యంతో పాటు జనరేటర్‌ను అందుబాటులో ఉంచామన్నారు.

నిరసన హోరు

▸ కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ నాయకులు, గోమిత్ర ఫౌండేషన్ సభ్యుల నిరసన



ఏలూరు కలెక్టరేట్ వద్ద ఏఐటీయూసీ నాయకుల ధర్నా.. (ఇన్‌సెట్‌లో) గోమిత్ర ఫౌండేషన్ సభ్యుల నిరసన

ఏలూరు రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్, డి.జోనల్ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ పలు విభాగాల్లో పనిచేసే కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించే జీతభత్యాలు చాలా వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకుడు పి.కిషోర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. పుప్పాల కన్నబాబు, నాయకులు బుగత జగన్నాథరావు, పోలా భాస్కరరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు, బి.నారాయణరావు, ఎస్.శ్రీనివాసరావు, డి.సుబ్బారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

గోమిత్ర ఫౌండేషన్ సభ్యుల నిరసన

● ఏలూరు జిల్లా సరిహద్దుల ద్వారా జరుగుతున్న గోవుల అక్రమ రవాణా నిరోధించాలని కోరుతూ విజయనగరం జిల్లా గోమిత్ర ఫౌండేషన్ ఫౌండర్ సూర్యరామ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి అనంతరం డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గోవుల అక్రమ రవాణా సరిహద్దులు మీదుగా సాగుతోందని, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రభుత్వ గోశాలలు ఏర్పాటు చేయాలని, అక్రమ గోశాలలపై ప్రత్యేక దర్యాప్తు చేసి అక్రమార్కులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. విశ్వ హిందూ పరిషత్ కొవ్వూ రు జిల్లా సహ కార్యదర్శి సవలం రామకృష్ణ, ఆర్ఎస్ఎస్ కట్టా చంద్రశేఖర్, మద్దూరి విష్ణు, ఎన్.రామకృష్ణ, తాతిన చైతన్య, కుంపట్ల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

14న 'ప్రభుత్వ ఐటీఐ'లో
అప్రెంటీస్ మేళా

ఏలూరు అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 14న పీఎంఎన్ఏఎం(పీఎంనామ్) అప్రంటీస్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డి.భూషణం తెలిపారు. టెన్త్ పాస్/ఫెయిల్, ఐటీఐ డిప్లొమా లేదా ఏదైనా వృత్తివిద్యాకోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలు, ఆధార్, ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు ఐటీఐ కార్యాలయ ఫోన్ నంబరు 08812-230269లో సంప్రదించాలని కోరారు.

భీమడోలు ఏఎంసీ చైర్మన్‌గా శేషగిరి

భీమడోలు,జూలై11(ఆంధ్రజ్యోతి): భీమడోలు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా శేషపు శేషగిరిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వైస్ చైర్మన్‌గా ఎన్. గణపతితో పాటు 17 మంది సభ్యులను ఏఎంసీ కమిటీలో నియమించినట్టు ఉత్తర్వులు అందాయి. దీనిపై టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కొత్త కమిటీని పలువురు అభినందించారు.


కేతవరంలో విద్యార్థినికి మొక్కను అందజేస్తున్న దృశ్యం

కేతవరంలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం

టి.నరసాపురం, జూలై11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో టీచర్స్ పేరెంట్స్ ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సౌకర్యాలు వినియోగించుకుని విద్యార్థులు బావిభారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి, మాజీ జడ్పీటీసీ నల్లూరి వెంకటచలపతిరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, ప్రత్యేకాధికారి లక్ష్మణరావు, ఎంపీడీవో నగ రాజకుమారి, విద్యాశాఖాధికారులు రామ్మూర్తి, ఎస్.కల్యాణి, పెద్దిన సత్యనారాయణ, సోంబాబు, భీమవరపు జగన్మోహన్‌రావు, బండి శ్రీనివాసరావు, కేతిరెడ్డి వీరారెడ్డి, టి.నరసాపురం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం లింగస్వామి పాల్గొన్నారు.


ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

గ్రామాల పరిశుభ్రతే లక్ష్యం కావాలి

పెదవేగి, జూలై 11(ఆంధ్రజ్యోతి) : గ్రామాల పరిశుభ్రతే అందరి లక్ష్యం కావాలని డీఎల్‌డీవో ఏబీపీవీ.లక్ష్మి అన్నారు. శుక్రవారం కొప్పాక గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్రం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రతే ఆరోగ్యమని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాముఖ్యతనివ్వాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తీసుకుంటున్న జాగ్రత్తలు, ప్రజలకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయం, చెత్త సేకరణ డంపింగ్ యార్డు, తరలింపు, ప్లాస్టిక్ నిషేధం, మరుగుదొడ్ల వినియోగం, వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొప్పాక గ్రామ సర్పంచ్ పి.భాస్కరదీక్షితులు, ఎంపీడీవో పి.శ్రీనివాస్, కేంద్ర బృందం సభ్యులు బి.సునీల్, కె.శివకుమారి, ఈవోపీఆర్డీ షరీఫ్, గ్రామ కార్యదర్శి బీహెచ్ఎస్వీకృష్ణంరాజు పాల్గొన్నారు.


చెత్త తీసుకువెళ్తున్న సిబ్బంది తీరును పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తున్నారా ?

▸ జిల్లా పరిషత్ సీఈవో శ్రీహరి

కామవరపుకోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈవో ఎం.శ్రీహరి శుక్రవారం కామవరపుకోట పంచాయతీ పరిధిలో జరుగుతున్న చెత్త పారిశుధ్య పనులను, సంపద తయారీ కేంద్రాలను సమగ్ర తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య సిబ్బంది నివాసాల నుంచి చెత్తను ఏ విధంగా వేర్వేరుగా తీసుకువెళ్తున్నారా, లేదా అని, తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా సేకరిస్తున్నారా, లేదా అని తనిఖీలు జరిపారు. సంపద తయారీ కేంద్రంలో నిర్వహణ తీరును, అందుకు సంబంధించిన రికార్డులను సీఈవో పరిశీలించారు. గ్రామ సర్పంచ్ కరిపోతు అనూష, వైస్ సర్పంచ్ మేడూరి రంగబాబు, పంచాయతీ కార్యదర్శి పి.రవినాయక్, ఎంపీడీవో సరళకుమారి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అర్బన్ బీఎల్వోలకు అవగాహన

జంగారెడ్డిగూడెం,జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం అర్బన్ బీఎల్‌వోలకు ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కె.స్లీవజోజీ, మున్సిపల్ కమిషనర్ ఎంవి.రమణ పాల్గొన్నారు.

'కమిటీల్లో బీసీలకు స్థానం కల్పించాలి'

లింగపాలెం, జూలై11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని మండల, గ్రామ కమిటీలలో బీసీలకు స్థానం కల్పించాలని పలువురు లింగపాలెం మండల బీసీ నాయకులు ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌ను కోరారు. ఇటీవల విదేశీపర్యటన ముగించుకుని వచ్చిన ఆయనను లింగపాలెం మండల బీసీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని బీసీలకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పిల్లల శ్రీనివాస్‌యాదవ్, చెన్ను శ్రీనివాస్‌యాదవ్, పి.వెంకటేశ్వరరావు, సీహెచ్ నాగేశ్వరరావు, చిన్ని, మహేశ్, పి.సత్యనారాయణ, సుబ్బారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఏలూరు నాలుగో డివిజన్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బడేటి చంటి


కుక్కునూరులో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల పోస్టర్లను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి

▸ ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరుటూటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. ఏలూరు నాలుగో డివిజన్‌లో 'సుపరిపాలనలో తొలిఅడుగు' నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వర్షాకాలంలో డ్రెయిన్లలో సిల్టును తొలగించాలని స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మునిసిపల్ శానిటేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ డ్రెయిన్లను ప్రక్షాళన చేయాలని ఆదేశించారు. డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఈడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, మునిసిపల్ మాజీ చైర్మన్ ఉప్పాల జగదీష్‌బాబు, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

● పెదవేగి : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం జానంపేట, జగన్నాథపురం, కవ్వగుంట, వంగూరు గ్రామాల్లో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి అనువుగా చర్యలు తీసుకున్నారు. పార్టీ నాయకులు ఈడ్పుగంటి అనిల్, సుగసాని గంగాధరరావు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, రమేష్, గోపిశెట్టి లక్ష్మీనారా యణ, సుంకర భాస్కరరావు పాల్గొన్నారు.

● కుక్కునూరు : కుక్కునూరు మండల కేంద్రంలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. రామాలయం సెంటర్‌లో ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, తల్లికి వందనం, దీపం పథకం త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వంటి పథకాలు అమలవుతున్నట్లు ప్రజలకు వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ పిచ్చుకరాజు, రమణరాజు, సత్యనారాయణ, నరేశ్, రాము, నరేంద్రరాజు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వం : పత్సమట్ల

●భీమడోలు : అన్ని వర్గాల అభివృద్ధికి, సంక్షేమానికి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పని చేస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు మండలంలోని కొల్లేరు గ్రామాలైన మల్లవరం, చెట్టున్నపాడు, ఆగడాలలంక, లక్ష్మీపురం, కోరుకొల్లు, గుండుగొలను గ్రామాల్లో పల్లెపల్లెకు పత్సమట్ల ధర్మరాజు కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కొల్లేరు గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జగన్ అసమర్థత పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయన్నారు. ఈ సందర్భంగా కొల్లేరు ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి హారతులిచ్చారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఉద్యాన పథకాలు చేరువ కావాలి : జేసీ


ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

కామవరపుకోట, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ ద్వారా అమలు చేస్తున్న పలు పథకాలు రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రతీ రైతుకు చేరాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కామవరపుకోట మండలంలోని గ్రామాల్లో గల ఉద్యానవన పంటలను ఆమె సందర్శించి రైతులతో చర్చలు జరిపారు. ఆయిల్‌ఫాం, కొబ్బరి తోటల్లో సాగు చేస్తున్న బహుళ, అంతర పంటల విధానాన్ని తెలుసుకున్నారు. ఉద్యాన యాంత్రీకరణ, ఉడ్‌చిప్పర్స్, చాప్‌కట్టర్‌ల పనితీరును పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంపై ఆరా తీసి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్. రామ్మోహన్, సహాయ ఉద్యాన అధికారి లక్ష్మి, రైతులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం



కామవరపుకోటలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కామవరపుకోట, జూలై 11(ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ కె.విజయబాబు సూచనలతో కళాశాల విద్య అకడమిక్ క్యాలెండర్ ప్రకారం అర్థశాస్త్రం, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, ఎకనామిక్స్ అధ్యాపకురాలు కె. ఇందిరాకుమారి, దారావతు మల్లేష్, పి.ఏడుకొండలు, ఎం.విజయకృష్ణ, కుమార్ రాజా పాల్గొన్నారు.

● చింతలపూడి:స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవంను శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో జనాభా నియంత్రణను కఠినంగా అమలు చేసిన దేశాలు ఇప్పుడు ఆ నిబంధనలను సడలిస్తున్నాయని వివరించారు. అధ్యాపకులు ఎం.సుబ్బారావు, ఎ.సంతోషరావు, కె.హరిప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఏలూరు అర్బన్:ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాల్లో బాగంగా డిగ్రీ, పీజీ విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి, డాక్టర్ రత్నమేరి, తదితరులు పాల్గొన్నారు.

● నిడమర్రు : తూర్పు గోదావరి జిల్లాలోని దూబచర్ల డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి చిత్ర లేఖనంలో నిడమర్రు మండలం చిన నిండ్రకొలను జడ్పీ హైస్కూలు చొక్కాకుల దీవెన(8వ తరగతి) ద్వితీయ స్థానం పొందగా, వ్యాస రచన పోటీల్లో కరిమెల్ల రిషిత (పదో తరగతి) తృతీయ స్థానం సాధించింది. వీరిని హెచ్ఎం జి.మల్లికార్జునరావు, విద్యా కమిటీ సభ్యులు అభినందించారు.

వేగవరం, పేరంపేటల్లో రేషన్ స్టాక్ పాయింట్లు


వేగవరంలో రేషన్ స్టాక్ పాయింట్‌ను ప్రారంభిస్తున్న దాసరి శేషు

జంగారెడ్డిగూడెం, జూలై 11(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని వేగవరం బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన రేషన్ స్టాక్ పాయింట్‌ను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్ర శేషు, పేరంపేట రోడ్డులోని బాట గంగానమ్మ లే-అవుట్ కాలనీ ప్రజల సౌకర్యార్థం రేషన్ స్టాక్ పాయింట్‌ను టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ ప్రారంభించారు. ఇప్పటివరకు ఆయా కాలనీల కార్డుదారులు రేషన్ తెచ్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లో రేషన్ స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయడం పట్ల ఆ ప్రాంత ప్రజలు, టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల కార్యదర్శి కుక్కల మాధవరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆలపాటి దుర్గారామ్‌ప్రసాద్, జనసేన గ్రామ అధ్యక్షుడు అనిశెట్టి శ్రీనివాస్, రమణ, నడుపుడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు
దరఖాస్తుల ఆహ్వానం

కుక్కునూరు/పోలవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి):కుక్కునూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అర్థశాస్త్ర విభాగంలో అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. అభ్యర్థులు సం బంధిత సబ్జెక్టులో పీజీ పూర్తి చేసి 50శాతం మార్కులుండాలన్నారు. ఈనెల 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులను కుక్కునూరు ప్రభుత్వ కళాశాలలో అందజేయాలి. 17న ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు.

పోలవరం జూనియర్ కాలేజీలో..

పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.సజిని తెలిపారు. అభ్యర్థులు ఎంఏ తెలుగులో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఈనెల 15 లోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

శాకంబరీ అలంకరణలో
సౌభాగ్యలక్ష్మీదేవి

ఏలూరు కార్పొరేషన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): సత్రంపాడు సౌభాగ్యలక్ష్మీదేవి అమ్మవారి ఆలయంలో ఆషాఢం శుక్రవారం నేపథ్యంలో అమ్మవారికి పలు రకాల కూరగాయలతో శాకంబరీ అలంకరణ జరిపి భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఊటుకూరి నాగేశ్వరశర్మ మహిళలతో సామూహిక కుంకుమార్చనలు జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.జి.ఎస్.వి.గోపాలకృష్ణ, అభివృద్ధి కమిటీ సభ్యులు చిన్నబాబు, శ్రీనివాసరావు, ప్రవీణ్ మిత్రబృందం భక్తులకు అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు.

గూటాల దుర్గమ్మకు
ఆషాఢం సారె

పోలవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): గూటాల గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలవరం ఏటిగట్టు సెంటర్‌లోని కనకదుర్గ ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, బంగారమ్మపేట కనకదుర్గ ఆలయం, నూతనగూడెం కనకదుర్గ ఆలయాలలో, వెంకటాపురం ముత్యాలమ్మ ఆలయంలో భక్తులు విశేష పూజలు, సామూహిక కుంకుమ అర్చనలు నిర్వహించారు. గూటాల కనకదుర్గ ఆలయంలో భక్తులు ఏర్పాటు చేసిన ఆషాడ చీర సారెలు పిండివంటలు పలువురిని ఆకర్షించాయి.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

ఆగిరిపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలోని హైస్కూల్ వద్ద ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భార్గవి అన్నారు. రమేష్ హాస్పిటల్స్ విజయవాడ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, న్యూరాలజిస్ట్, ఆప్తమాలజీ, డెంటల్, గైనకాలజీ వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలు శిబిరం నిర్వహించనున్నట్లు ఆమె అన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ముదినేపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ సబ్జెక్ట్ బోధనకు అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఓరుగంటి సత్యనారాయణమూర్తి తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా తమ దరఖాస్తులను కళాశాల కార్యాలయానికి పంపాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పట్టాలిచ్చేందుకు లంచం డిమాండ్‌పై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముదినేపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం ఊటుకూరులో 2.40 ఎకరాల భూమికి పట్టా ఇచ్చేందుకు వీఆర్వో రూ.50 వేలు డిమాండ్ చేశాడని ఓ వ్యక్తి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తహసీల్దార్ లతీఫ్ పాషా తెలిపారు. 'చేయి తడపాల్సిందే' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' లో ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ వెట్రిసెల్వి దీనిపై విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు విచారణ జరిపి వివరణ ఇచ్చారు. ఆ గ్రామానికి చెందిన యర్రంశెట్టి మహంకాళిరావు అనే వ్యక్తి 3.10 ఎకరాల పోరంబోకు భూములకు పట్టా ఇప్పించాలని ఈ ఏడాది జూన్ 16న దరఖాస్తు చేశాడని, ఆ భూముల వివరాలు సేకరించగా మురుగు కాల్వలు, పుంత పోరంబోకు భూములుగా గుర్తించామని, కలెక్టర్‌కు నివేదిక పంపినట్టు తహసీల్దార్ తెలిపారు.

పేదలకు వరం సీఎం సహాయ నిధి



ఆగిరిపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్ఎఫ్ ఒక వరమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న సింహాద్రి అప్పారావు పేట గ్రామానికి చెందిన మహాలక్ష్మికి సీఎం సహాయనిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్‌ఓసిని రోగి కుటుంబానికి మంత్రి అందజేశారు. బాధిత కుటుంబం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

నూజివీడు టౌన్: నూజివీడు మండలం తూర్పు దిగవల్లి గ్రామానికి చెందిన బి నాగరాజు కుటుంబానికి రూ.1లక్ష, ఎల్‌ఓసి పత్రాన్ని మంత్రి పార్థసారథి అందించారు. నాగరాజు కుటుంబ సభ్యులు విజయవాడలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వారి చికిత్స కోసం ఆర్థిక సాయం అందించాలని మంత్రిని కోరగా సీఎం సహాయనిధి నుండి రూ.1లక్ష రూపాయిలు ఎల్‌ఓసి మంజూరు పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

భూమిని తిరిగి ఇచ్చేయాలని మంత్రికి వినతి

ముసునూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ముసునూరులో ఇళ్ళస్థలాల సమస్యను మాజీ సర్పంచ్, రైతు రేగుల గోపాలకృష్ణ శుక్రవారం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళి అర్జీ అందజేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీకి సంధ్య వాగు వద్ద ఉన్న 7.08 ఎకరాల భూమిని ఇళ్ళస్థలాలకు ఇచ్చామని, దీనికి రూ.1 కోటి 40 లక్షలు ప్రభుత్వం చెల్లించిందని, సుమారు 282 మంది లబ్ధిదారులకు ఇళ్లపట్టాలను సైతం అధికారులు ఇచ్చారని రైతు మంత్రికి వివరించారు. అయితే ఈ భూమి గ్రామానికి సుమారు మూడున్నర కిలోమీటర్లు దూరం ఉండటంతో లబ్ధిదారులు ఇళ్ళస్థలాలను తిరస్కరించి, పట్టాలను వెనక్కి ఇచ్చారని తెలిపారు. లబ్ధిదారులకు ఆమోదయోగ్యంగా లేని ఈ భూమిని తిరిగి తనకు ఇప్పించాలని, ప్రభుత్వం ఇచ్చిన నగదు మొత్తాన్ని చెల్లిస్తామని, ఈ సమస్య పరిష్కరించాలని రైతు మంత్రికి విజ్ఞప్తి చేశారు.

కేసుల పరిష్కారానికి మీడియేషన్ సెంటర్



సెంటర్‌ను ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు

కైకలూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): కక్షిదారులు త్వరిత గతిన కేసులు రాజీ చేసుకునేం దుకు మధ్యవర్తిత్వం ఎంతో ఉపయోగపడు తుందని సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. శుక్రవారం కైకలూరు న్యాయస్థానాల సముదా యంలో మీడియేషన్ సెంటర్‌ను జూనియర్ సివిల్‌జడ్జి ఎం శివకిరణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం దేశం కోసం అనే కార్యక్రమం ద్వారా కక్షిదారులకు త్వరితగతిన కేసులు పరిష్కరించేందుకు ఏర్పాటుచేశారని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మధ్యవర్తిత్వం చేసేందుకు ముగ్గురు న్యాయవాదులకు ముందుగానే శిక్షణ ఇచ్చామని, వారిలో మాడెం వీర వెంకట సత్యనారాయణ, కె కోటయ్య, డి శివశంకర్ నియమించినట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమృద్ధిగా తాగునీరివ్వడమే లక్ష్యం

ముసునూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందించటడమే లక్ష్యమని పంచాయతీరాజ్ డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వెంకటరత్నం అన్నారు. రమణక్కపేట ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను శుక్రవారం ఆయన ఎంపీడీవో బి.ఏ సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. కాలనీలో నిరుపయోగంగా ఉన్న చేతి పంపును మరమతులు చేసి, వినియోగంలోకి తెచ్చారు. ఈ సందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ కాలనీని మంచినీటి బోరులో మోటారు పూర్తిగా కాలిపోవడంతో తాగునీటి సమస్య తలెత్తిందని, కాలనీవాసులకు నీటి ఇబ్బందులు లేకుండా చేతి పంపును బాగుచేయడంతోపాటు ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నామన్నారు. శనివారం నాటి కల్లా నూతన మోటారు బిగించి, నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు.

జనాభా పెరుగుదలతో పేదరికం ముప్పు

కైకలూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): జనాభా పెరుగుదల వల్ల దేశంలో తలసరి ఆదాయం తగ్గి పేదరికం పెరుగుతుందని ప్రిన్సిపాల్ వై శ్రీలత అన్నారు. శుక్రవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఆర్థికశాస్త్రం విభాగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జనాభా పెరుగుదలపై వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించి బహుమతులను పంపిణీ చేశారు.

కలిదిండి: కలిదిండిలో శుక్రవారం వైద్యాధికారులు, ఆశావర్కర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవి మాట్లాడుతూ గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం అంతరం ఉండాలన్నారు. తల్లి కావటానికిసరియైన వయస్సు, శారీరకంగా, మానసికంగా పరిపక్వత చెంది ఉండాలన్నారు.

సం'క్షామ' హాస్టళ్లు





ముసునూరులో శిథిలావస్థలో బీసీ హాస్టల్ భవనం (ఇన్‌సెట్లో) పెచ్చులూడిన స్లాబ్..



మూతల్లేని సెప్టిక్ ట్యాంక్‌లు



కలిదిండిలో శిథిలావస్థలో ఉన్న బీసీ బాలికల హాస్టల్ భవనం

- ఎవరికీ పట్టనంత నిర్లక్ష్యం
- ఏ ఏటికాయేడే వెన్నాడుతున్న సమస్యలు
- ముందుచూపు కొరవడి.. భవిష్యత్ ప్రణాళిక లేక
- పేద పిల్లలే కదా అని చిన్నచూపా?
- శిథిలావస్థలోనే బిక్కుబిక్కుమంటూ పిల్లలు
- కొన్ని చోట్ల కటిక నేలపైనే పడక

ఆంధ్రజ్యోతి విజిట్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లల చదువులకు సంక్షేమ హాస్టళ్ళే దిక్కు. పట్టణాలకు సుదూరంగా బతుకీడ్చుకొస్తున్న వారంతా తమ పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పించేందుకు ఇవే దిక్కు. ప్రతి ఏటా పిల్లల అవసరాలను తీర్చడమే కాక ఒకప్పుడు నిఖార్సైన సౌకర్యాలు అందించేవారు. రానురాను హాస్టళ్ల నిర్వహణ అడ్డగోలుగా మారింది. ఏడాది పొడవునా వీటిలో చేరిన పిల్లలు అనేక చోట్ల బయటకు చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఇప్పటికే ప్రభుత్వ అధీనంలో ఉన్న సంక్షేమ హాస్టళ్ళల్లో ఒక్క ఏలూరు జిల్లా పరిధిలోనే అనేకం శిథిలావస్థకు చేరాయి. పెచ్చులూడి ఏ క్షణమైనా కుప్పకూలడానికి సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని తలుపులు, కిటికీలు దెబ్బతిని దీనావస్థలో ఉన్నాయి. మరుగుదొడ్ల పరిస్థితి అంతంత మాత్రమే.

ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ళల్లో అనేకం దెబ్బతిన్నా వేసవిలోనే వీటికి మరమ్మతులు నిర్వహించాలన్నా అధికారులు బేఖాతర్. పేద పిల్లలకు అత్యంత సౌకర్యంగా ఉండాల్సిన భవనాలు పాడుపడిన విషయం తెలిసినా ఆ మేరకు సరికొత్త ప్రతిపాదనను పంపి సరిపెట్టుకోవడమే జిల్లా అధికారులకు ఆనవాయి తీగా ఉంది. ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్ళి.. వేసవిలోనే వీటిని చక్కదిద్దితే బడులు, హాస్టళ్ళు నడిచే నాటికి హాస్టళ్ళల్లో ఇలాంటి దుస్థితి ఉండేదా? ముందుచూపు కొరవడడం, పేద వర్గాలకు చెందిన పిల్లల పట్ల ఆషామాషీగా తీసుకోవడం, కేవలం నివేదికల రూపంతోనే సరిపెట్టడం ఎంతవరకు సమంజసం. కొన్ని హాస్టళ్ళల్లో బాత్‌రూములకు దిక్కులేదు. ఒక్క అడుగు ముందుకేస్తే రాత్రిపూట ఆదమరిచి నిద్రించేందుకు అనువైన పరిస్థితులు లేవు. కొన్నిచోట్ల కటిక నేల మీదే పిల్లల పడక. అంతకంటే మించి.. ఇస్తామన్న కాస్మొటిక్ చార్జీలు కొందరికే పరిమితం.. కనీస వస్తువులు, పుస్తకాలు భద్రపరిచేందుకు ట్రంక్ పెట్టెల సరఫరా ఎప్పుడో వదిలేశారు.

దీనికితోడు తాగునీరు నాణ్యత పరిశీలన లేదు. మన పిల్లలు కాదుకదా అనే ధోరణే అందరిలోనూ ఉంది.

ఇంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కొన్ని హాస్టళ్ళల్లో పిల్లల స్నానాల కోసం వేడి నీళ్ళు అందుబాటు ఉంచేందుకు అనువైన సౌకర్యాలు కల్పించారు. జగన్ జమానాలో ఇలాంటి సౌకర్యాలు కాస్తా తుస్సుమన్నాయి. ఆ మాట ఎత్తేం దుకు అధికారులుగాని, వార్డెన్‌లుగాని సాహసించలేకపోయారు.

జిల్లా వ్యాప్తంగా 50 ఎస్సీ హాస్టళ్ళు, మరో 33 బీసీ, ఏడు ఎస్టీ హాస్టళ్ళల్లో వేల మంది విద్యార్థులు ఉన్నారు. హాస్టళ్ళ తనిఖీలు తూతూ మంత్రంగా వ్యవహరించడం ఒక ఎత్తయితే.. పిల్లలను హాస్టళ్ళల్లో చేర్పించాం కాబట్టి గొడవ పడితే పిల్లలకు ఎక్కడ లోటు జరుగుతుందోననే బెంగతో తల్లిదండ్రులు ఎక్కడా నోరు విప్పే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇప్పటికీ కొన్ని హాస్టళ్ళల్లో పరిస్థితి మెరుగు పర్చాల్సింది పోయి చూసీచూడనట్టు వదిలేశారు. అధికారులు తమ పాత్రేమీలేదన్నట్టుగా వ్యవహార శైలి.

వానొస్తే గదుల్లోకి నీరు..

ముసునూరు: ముసునూరులోని బీసీ సంక్షేమ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. స్లాబ్ పెచ్చులూడి ఐరన్ బయట పడింది. అక్కడక్కడ గోడలు బీటలువారాయి. వర్షం కురిస్తే గదుల్లో నీరుచేరటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సెప్టిక్ ట్యాంక్‌పై వేసిన మూతలు ధ్వంసమై దుర్వాసన వెదజల్లుతోంది. భవనం పరిస్థితి చూసి హాస్టల్‌లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడడం లేదు. గత ఆరు నెలలుగా విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు రావడం లేదు. ఈ ఏడాది దుప్పట్లు, ఇతర సామగ్రి రాలేదు. ఈ భవనం మరమ్మతులకు సూమారు రూ.10 లక్షలు నిధుల కోసం గత ఏడాది పంచాయతీరాజ్ అధికారులు ప్రతిపాదన పంపగా, నిధులు ఇంకా మంజూరు కాలేదు. అలాగే ఎస్సీ బాలికల వసతి గృహంలో బాలికలకు ఆరు నెలల నుంచి కాస్మెటిక్ చార్జీలు రావాల్సి ఉంది. ఇంకా దుప్పట్లు, సామగ్రి ఇవ్వలేదు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, చికెన్, గుడ్లు పెడుతున్నారు. ఈ రెండు హాస్టళ్లలో విద్యా ర్థులు బోరు నీటినే తాగుతున్నారు. మినరల్ వాటర్ సౌకర్యం లేదు.

కొద్దిపాటి వర్షానికే స్లాబు లీకేజీ

కలిదిండి: మండలంలో మొత్తం మూడు ప్రభుత్వ హాస్టల్స్ ఉన్నాయి. కలిదిండిలో 2, కోరుకొల్లులో ఒకటి ఉన్నాయి. కలిదిండి బీసీ బాలికల హాస్టల్ భవనం శిథిలావస్థకి చేరింది. కొద్దిపాటి వర్షానికే స్లాబు లీకేజీ కావటంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారు. భవనానికి మరమ్మతులు చేయాల్సి ఉంది. ఎస్సీ బాలుర హాస్టల్ భవనానికి పడమర భాగంలో ప్రహరీ లేకపోవటంతో పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. డ్రెయినేజీ సమస్య ఉంది. కోరుకొల్లు ఎస్సీ బాలికల హాస్టల్ భవనానికి పోలీసులు సహకారంతో మరమ్మతులు చేశారు.

రాజకీయాలకతీతంగా అందరికీ పథకాలు



ముసునూరులో కరపత్రాల పంపిణీ



నెక్కలం గొల్లగూడెంలో ప్రచారం..



పెదలంక దళితవాడలో కరపత్రాల పంపిణీ

ముసునూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా అన్నివర్గాలకు పథకాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘు బాబు అన్నారు. శుక్రవారం ముసునూరు బీసీ కాలనీలో సుపరి పాలనలో తొలి అడుగు-ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో ఆయన పాల్గొని సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ గత ఐదేళ్ళలో అభివృద్ధికి నోచుకోని రాష్ట్రం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల సమర్థ పాలనలో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి బాబి, గ్రామ అధ్యక్షులు గార్లపాటి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి పి.సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు నరదల రాంబాబు అన్నారు. నెక్కలం గొల్లగూడెం గ్రామంలో 245వ బూత్‌లో శుక్రవారం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలను అందజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ సర్పంచ్ ఎస్ సాంబయ్య, పార్టీ గ్రామ మాజీ కార్యదర్శి నల్లమోతు మురళి, మాజీ సర్పంచ్ భిక్షాలు తదితరులు పాల్గొన్నారు. పిన్నమరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కుంపటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నూజివీడు నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు జన్ని రాంబాబు, సమన్వయ సభ్యులు రొంపిచర్ల గిరిధర్, గ్రామ టీడీపీ ప్రధాన కార్యదర్శి గోళ్ళ బాలయ్య, తెలుగు యువత, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కలిదిండి: పెదలంక పంచాయతీ పరిధిలో దళితవాడలో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ అక్కల వెంకటాచలం, బూత్ కన్వీనర్ చాబత్తిన శ్రీనివాసరావు, నాయకులు దున్న భోగేశ్వరరావు, రెడ్డి చక్రవర్తి, చాబత్తిన దావీదు, ముద్దం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

గుప్పుమంటున్న గంజాయి



- కైకలూరులో పెరుగుతున్న గంజాయి కల్చర్
- నిర్మానుష ప్రాంతాలే అడ్డా
- ఉజ్వల భవిష్యత్తు కోల్పోతున్న యువత

ఎదిగొచ్చిన యువకులు కుటుంబానికి ఆసరాగా నిలుస్తారని తల్లిదండ్రులు వారిపై ఎన్నో ఆశలు పెట్టుకుంటే చాలామంది యువ కులు మత్తుకు బానిసలుగా మారి పెడదోవ పడుతున్నారు. వీరిలో చాలామంది గంజాయి కి బానిసలై మత్తులో కుటుంబీ కులను వేధించడంతో పాటు నేరాలు చేసేందుకు కూడా వెనుకాడడం లేదు.

కైకలూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): జనావాసాలకు దూరంగా నిర్మానుష్య ప్రదేశాలను గంజాయి సేవించడానికి యువకులు అడ్డాగా మార్చుకుంటున్నారు. గంజాయి మత్తులో వీరు ఎప్పుడు ఎవరిపై తెగబడతారోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై వెళుతూ వెర్రి కేకలు వేస్తున్నారు. వీరిని అడ్డుకునేందుకు పోలీసులు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఏదో పక్క నుంచి గంజాయి రవాణా సాగుతూనే ఉంది. ఇటీవల ఎమ్మెల్యేలతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సైతం గంజాయి సమస్యను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి అరికట్టాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ రవాణాను అరికట్టాలని ఎమ్మెల్యే సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడికక్కడే పటిష్టమైన తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ గంజాయి రవాణా సాగుతూనే ఉంది. కైకలూరు పట్టణంలో బహిరంగ ప్రదేశాలైన జగనన్న కాలనీ లే అవుట్ ఖాళీ ప్రదేశాలను, 100 ఎకరాల చేపల చెరువు సమీపంలోనూ, దానెగూడెం రోడ్డులోని ఇళ్ళవెనుక ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు అనేక బ్యాచ్‌లుగా చేరి గంజాయి, మద్యం సేవిస్తున్నారు. ఆ సమీపంలో నివాస గృహాలు ఉండడంతో మహిళలు, చిన్నపిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. యువకులు గుంపులు గుంపులుగా చేరి నిత్యం గంజాయిని తాగుతున్నారు. కైకలూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో, రైల్వేట్రాక్ వెంబడి, మార్కెట్‌యార్డ్‌లోనూ, కైకలూరులోని ఓ మంచినీటి చెరువుగట్టుపై, గోపవరం గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్డులో ఎక్కువగా యువకులు గంజాయి సేవిస్తూ సంచరిస్తున్నారు. మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల జరిగిన చోరీలలో కూడా యువకులు గంజాయి సేవించి దొంగతనాలకు పాల్పడినట్టుగా ఆయా గ్రామాల్లో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే కలిదిండి మండలంలో గంజాయి వ్యాపారం పెద్దఎత్తున కొనసాగుతోంది. చిన్న చిన్న పొట్లాలుగా చేసి రూ.50, రూ.100లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. గంజాయి ఏలూరు, ఆకివీడు, భీమవరం, విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి తీసుకు వస్తున్నారు. ఈ గంజాయి రవాణాను గుట్టుచప్పుడు కాకుండా కలిదిండి మండలంలో కొంత మందికి అందిస్తున్నారు. తాడినాడ, ఉప్పుటేరు పరివాహక ప్రాంతాల్లోనూ గంజాయి విచ్చలవిడిగా రవాణా అవుతోంది. అక్కడి నుంచి ఆ చుట్టుపక్కల ప్రాంతాల యువకులతో పాటు కైకలూరు ప్రాంతానికి సైతం సరఫరా అవుతోంది. దీంతో యువత ఉజ్వల భవిష్యత్తును వదిలివేసి మత్తుకు బానిసలవుతున్నారు.

పోలీసులు దృష్టి సారించాలి...

గంజాయిని సేవిస్తున్న యువకులకు స్థానికంగా ఎవరు విక్రయిస్తున్నారు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారెవరు? అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. మత్తుకు బానిసలవుతున్న యువతపై పోలీసుల నిఘా ఉంటే వారిలో మార్పు వచ్చే అవకాశం ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల నిర్వహణ కోసం కైకలూరు, కొల్లేరు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ జీవీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. కైకలూరు-ఏలూరు రోడ్డులోని గ్రీన్ విలేజ్, ఆటపాక ఫీడర్ పరిధిలోని కైకలూరు, దానగూడెం, వైఎస్సార్‌కాలనీ, కరకట్ట, జాన్‌పేట, ఆటపాక గ్రామాల్లో మరమ్మతులు, చెట్లను తొలగించేందుకు సరఫరా నిలిపివేస్తామన్నారు. అలాగే మండలంలోని పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలో కొల్లేటికోట, పందిరిపల్లిగూడెం, పెంచికలమర్రు, శృంగ వరప్పాడు, గోకర్ణపురం గ్రామాల్లో విద్యుత్‌లైన్లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపునకు సరఫరా నిలిపివేస్తారని, వినియోగదారులు గమనించాలన్నారు.

ముదినేపల్లి: విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల కారణంగా చిగురుకోట 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. వినియోగదార్లు గమనించి సహకరించాలని కోరారు.

అన్నదాత సుఖీభవ పథకానికి రేపటి వరకు గడువు

చాట్రాయి, జూలై 11(ఆంధ్రజ్యోతి): రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోవటానికి ఈనెల 13వ తేదీ వరకు గడువు అని ఏవో శివశంకర్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు ఆర్ఎస్‌కేలకు వచ్చి జాబితాలో తమ పేరును సరిచూసుకొని, పేరు లేకపోతే గ్రీవెన్సు ద్వారా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా కుటుంబంలో ఒక్కరికి మాత్రమే లబ్ధి చేకూరుతుందని అన్నారు. పంటల బీమా పథకం రైతులను ఆదుకుంటుందన్నారు. పథకం చేరే రైతులు మీసేవా కేంద్రం, ఆర్ఎస్‌కేలలో సంప్రదించాలని కోరారు.

త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా అట్లూరి

మండవల్లి జూలై 11(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలంలోని మోఖాసా కలవపూడి పీఏసీఎస్ పాలక వర్గం నూతన అధ్యక్షుడిగా అట్లూరు వెంకటేశ్వరరావు శుక్రవారం ఎన్నికయ్యారు. త్రిసభ్య కమిటీలో డైరెక్టర్లుగా కూనపురెడ్డి శ్రీనివాసరావు, వరద శివనాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అట్లూరి మాట్లాడుతూ కో-ఆపరేటివ్ వ్యవస్థలో బ్యాంకును రైతులకు మరింత చేరువ చేస్తామని పేర్కొన్నారు. క్లస్టర్ 2 ఇన్‌చార్జి, గన్నవరం నీటి సంఘం అధ్యక్షుడు కూనపురెడ్డి బాలకోటేశ్వరరావు, గన్నవరం మాజీ సర్పంచ్ సింగనపూడి అప్పారావు, మోఖాసా కలవపూడి టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాశీ కృష్ణ, గన్నవరం టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు తలవంటి ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి వరద..దూసుకొస్తోంది!

(5వ పేజీ తరువాయి)

సాగింది. గతేడాది జూలై 27న వారంపాటు గోదావరిలో వరద బెంబెలెత్తించింది. అప్పట్లో భద్రాచలం వద్ద 56.9 అడుగుల మేర వరద నీరు చేరింది. ఈ అనుభవాల నేపథ్యంలో జూలై వచ్చిం దంటే తీరంలో అంతా గడగడలాడాల్సి వస్తోంది.

అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్

'భద్రాచలం వద్ద గోదావరి నదికి శనివారం తెల్లవారుజామున మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయబోతున్నారు. యంత్రాంగం అప్రమత్తం కావాలి. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ప్రజలెవరూ నదిలోకి వెళ్లవద్దు. చేపల వేట చేయవద్దు. జాగ్రత్తగా ఉండండి' అంటూ కలెక్టర్ వెట్రిసెల్వి కుక్కునూరు, వేలేరుపాడులలో యంత్రాంగాన్ని, స్థానికులను శుక్రవారం రాత్రి అప్రమత్తం చేశారు. సాధ్యమైనంత మేర ప్రసవానికి దగ్గరలో వున్న గర్భిణులను దగ్గరలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలని, వృద్ధులు, పిల్లలు, విభిన్న ప్రతిభావంతులను సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని ఆదేశించారు. దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో వరద పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వాసితులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలని వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీచేశారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్ల సౌకర్యం కల్పించాలని, వాటర్‌ట్యాంకులు సిద్ధం చేయాలని, అత్యవసర సమయంలో వినియోగం నిమిత్తం మోటారుబోట్లు, ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. వరద పునరావాస కేంద్రాల్లో నిత్యావసర సరుకులు, కాయగూరలు సిద్ధం చేయాలన్నారు. వరద నీరు ప్రవహించే కల్వర్టులు, కాజ్‌వేలు, రహదారులను ముందస్తుగా మూసి వుంచడంతోపాటు అవి ప్రజలు దాటకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు అత్యవసర టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి జంగారెడ్డిగూడెం ఆర్డీవో, ఐసీడీఎస్ పీవోలను ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాల్సిందిగా ఆదేశించారు. వరద ప్రభావిత గ్రామాలైన లచ్చిగూడెం, గొమ్ముగూడెం గ్రామస్తులతో ఐసీడీఎస్ పీవో రాములనాయక్ భేటీ అయ్యారు. పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో నరసింహరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వీరాస్వామి గ్రామాల్లో పర్యటిస్తూ ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.దాచారం పునరావాస కేంద్రంలో విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేసినట్టు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్‌రాజు చెప్పారు. పునరావాస కేంద్రాన్ని పరిశీలించి విద్యుత్తు సౌకర్యంతో పాటు జనరేటర్‌ను అందుబాటులో ఉంచామన్నారు.



వేలేరుపాడు మండలం ఎద్దువాగు కాజ్‌వేపై చేరిన వరదనీరు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ఉద్యోగ విరమణ చేసిన ఎంఈవో-1 సేవ్యానాయక్‌కు సత్కారం

ముదినేపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి ఎంఈవో -1, నూజివీడు ఇన్‌చార్జి డీవైఈవోగా విధులు నిర్వహించి గత నెలాఖరున ఉద్యోగ విరమణ చేసిన ఎం. సేవ్యానాయక్‌ను ఉపాధ్యాయ సంఘాలు శుక్రవారం ఘనంగా సత్కరించాయి. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్, మండల అధ్యక్ష, కార్యదర్శులు కృపాకర్, వెంకటరత్నం, ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు పుట్టి గణేష్, యూటీఎఫ్ నాయకులు, పీఆర్టీయూ అధ్యక్షుడు నాగేశ్వరరావు సన్మానించారు. మండల ఎంఈవో -1 గా బాధ్యతలు చేపట్టిన డి. రామారావును కూడా సత్కరించారు.

బూత్ కన్వీనర్లకు సత్కారం

ముసునూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని 90 శాతం పూర్తిచేసిన బూత్ కన్వీనర్లను మంత్రి పార్థసారథి ఆదేశాల మేరకు శుక్రవారం టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ముసునూరులో 79వ బూత్ కన్వీనర్ రెడ్డి కృష్ణ, గుళ్ళపూడిలో 70, 73 బూత్‌ల కన్వీనర్లు వేంపాటి రాధాకృష్ణ, కొల్లి నాగ వెంకట ప్రసాద్‌లు, కాట్రేనిపాడులో 90వ బూత్ పాలడుగు మోహన్ కోటేశ్వరావు, చిల్లబోయినపల్లిలో 108వ బూత్ కన్వీనర్ కండేపు ప్రసాద్‌ను టీడీపీ మండల అధ్యక్షులు గద్దె రఘుబాబు, స్థానిక నాయకులు సన్మానించారు.

ఈయూ ఆవిర్భావ దినోత్సవం

నూజివీడు టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవంను నూజివీడు ఆర్టీసీ బస్ డిపో వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ నాయకుడు రంగు శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించారు. నాయకుడు ఎం. గంగాధర్ యూనియన్ పోరాటాలు గురించి, సాధించిన విజయాలపై సభ్యులకు వివరించారు. డిపో సెక్రటరీ కుమార్, ట్రెజరర్ పీఎస్ రావు, జాయింట్ సెక్రటరీలు ఎంఎస్ కుమార్, పి. సూర్య, గ్యారేజ్ నాయకులు రామచంద్రరావు, కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

ముదినేపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించే విషయంలో సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన వైస్ ఎంపీపీ రాచూరి రాధా సుకన్యతో కలసి గురజలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ చూపించాలని, కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. కలిదిండి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ బత్తిన కిశోర్, నాయకులు రాచూరి కుమార్, మోట్రు యేసుబాబు, మామిడపల్లి రంగారావు, దేవస్థానం మాజీ చైర్మన్ మీసాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.